# మిసిమి

మాస పత్రిక

ఫిబ్రవరి 2008



రూ. 8/-



జలాలుద్దిన్ రూమి



సూఫీయోధుల సంకేతం



ధ్యానం ఇలా!



ధ్యానం తరువాత శుభాకాంక్షలు



విఖ్యాత కళాకారుడు, ఎం.ఎఫ్. హుసేన్ గీసిన సూఫీల చిత్రాలు

# మిసిమి

**"All that we are is the product of what we have thought" is "We are what we think." - Dammapada.**


సంపుటి 19 ఫిబ్రవరి 2008 సంచిక 2

వ్యవస్థాపక సంపాదకుడు : **డాక్టర్ రవీంద్రనాథ్ ఆలపాటి**


## విషయ సూచిక


| | |
|---|---|
| సంక్లిష్టతా భరితం మానవ ప్రకృతి | మూలం : ఎమ్.టి.వాసుదేవన్ నాయర్<br>అనువాదం : డా॥ జె. లక్ష్మిరెడ్డి |
| చార్లీ చాప్లిన్ : అంతరంగం | వల్లభనేని అశ్వినికుమార్ |
| సర్వమతసార సర్వస్వం - సూఫీజం | డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి |
| సామాజిక పరిశోధకులకు ఉండాల్సిన లక్షణాలు! | సి.వి. సర్వేశ్వర శర్మ |
| విశ్వనాథ - సౌందర్య మీమాంస | డా॥ యు.ఎ.నరసింహమూర్తి |
| నొబెల్ పురస్కారం గెలవ నందుకు | మూలం : డోరిస్ లెసింగ్<br>అనువాదం : సుమనస్పతి రెడ్డి |



విడిప్రతి రూ. **8/-** వార్షిక చందా రూ. **100/-** విదేశీయులకు **$ 20**

ముఖచిత్రం : **చార్లీ చాప్లిన్**

Printed & Published by **Bapanna Alapati,** at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad, Hyderabad - 20. Ph. 27645536
E-mail : misimi@kalajyothi.com

సంపాదకుడు : **అన్నపరెడ్డి వెంకటేశ్వర రెడ్డి**

# సంస్మరణ



'మిసిమి' వ్యవస్థాపక సంపాదకులు డా. ఆలపాటి రవీంద్రనాథ్ కాలధర్మం చెంది, ఈ నెలకు పండ్రెండు సంవత్సరాలు గతించాయి. ఆయన 1996, ఫిబ్రవరి 11వ తేదీన ఊపిరితిత్తుల వ్యాధితో మరణించారు. తుదిశ్వాస తీసే వరకు ఆయన 'మిసిమి'నే తలచుకొన్నారు. 'మిసిమి' ఆయన మానస పుత్రిక. మనస్సును పంచుకొని పుట్టింది. మనస్సును పంచుకొని ఎదిగింది. నాటికి దాని వయస్సు ఆరేళ్ళు. ఆ చెంగు చెంగున ఎగిరే పిల్లకు ఇప్పుడు 18 ఏడులు వచ్చాయి. "నాయకం" వచ్చింది. నిండు నిగారింపుతో నడుస్తోంది పాఠకుల అభిమానం చూరగొంటూ.

బిగ్ బాంగ్‌తో విడవడిన ఈ భూమి, నాడు అందుకొన్న శక్తితోనే యుగయుగాలుగా అలసట లేకుండా, ఊపు, వేగం తగ్గకుండా ఎలా పరుగులు తీస్తోందో, ఆలాగే 'మిసిమి' గూడ ఆయన నుండి అందుకొన్న బీజ బలంతో, అలుపు సలుపులు లేకుండా, అదే ఇనుమడించిన ఉరవడి, వేగం, సౌకుమార్యం, గాంభీర్యం, దీపటిమలతో తన పయనం సాగిస్తూనే ఉంది. ఆయన వదిలిన ఆ బీజరూప పటిమకు రంగు పూసి, ఆకృతిని కల్పిస్తూ, పాఠకులకు ఆయన ఆశంసలను ఉన్మేషంగావిస్తూ "తడబడని" అడుగులతో వారిని చేరుతోంది.

డా. రవీంద్రనాథ్‌కు సౌందర్య నేత్రం - eye for the beauty - ఉంది. ఎక్కడ గూడ ఆయన సౌందర్యాన్ని చూడగలిగేవాడు. ఈ సౌందర్యేక్షణ ఆయన మూర్తిమత్వంలో అంతర్గత భాగమైంది. అందుకే తనకు తెలియకనే ఏది సుందరమో చెప్పి, దాని వెనుక ఉన్న సత్యాన్ని, దీనిని గుర్తించడం వలన కలిగే "శివాన్ని" బహిర్గతం చేశాడు.

Beauty, Truth, Good - సుందరం, సత్యం, శివంలు పాశ్చాత్య భావనలేగాని మన భావనలు కావు అనే వారు. నేనూ అదే అనుకొంటాను.

ఆయన ఏ లోకాలలోనో లేరు. "మిసిమి" ప్రపంచంలో, "కళాజ్యోతి" ప్రపంచంలోనే ఉన్నారు. 'మిసిమి'లోనే ఉన్న ఆయనకు శ్రద్ధాంజలి.



ఎమ్.టి.వాసుదేవన్ నాయర్
(1933)

# సంక్లిష్టతా భరితం మానవ ప్రకృతి

**1995వ సం॥ జ్ఞానపీఠ్ పురస్కార స్వీకారోపన్యాసం**

**(మళయాళం నుండి హిందీలోకి అనువదించబడిన ఉపన్యాసానికి తెలుగు అనువాదం)**



అనువాదం : డా॥ జె. లక్ష్మిరెడ్డి

ఈ దేశంలో నా భాష మాట్లాడేవారి సం1ఖ్య చాలా తక్కువే. కొన్ని భారతదేశ భాషలతో పోలిస్తే దీని చరిత్ర ప్రాచీనమైంది కూడా కాదు. అయినా ఇది సంపూర్ణంగా ఒక ప్రాణవంతమైన భాష. అన్ని దేశ-విదేశ భాషల గొప్ప రచయితల రచనలకు మళయాళీలు మొదటి నుండి స్వాగతం పలుకుతూ వచ్చారు. ఈ దిశగా పని చేయడానికి ప్రభుత్వ సంస్థలు ముందుకు రాక ముందే ప్రసిద్ధులైన పండితులు హిందీ, బెంగాలీ, మరాఠీ మొదలైన భాషలు నేర్చుకొని ఆ భాషల ప్రముఖ రచనలను మళయాళంలోకి అనువదించారు. వాటితో పాటు తోలస్తోయ్, దాస్తోవస్కీ, చెఖోవ్, మొపాసా, ఫ్లాబర్ట్, విక్టర్ హ్యూగోల రచనల అనువాదాలు కూడా వెలువడ్డాయి. ఉదాత్త సాహిత్య రచనలు ఏ భాషలో రచించినవైనా అవన్నీ ఒక సార్వదేశిక సాహిత్య సంపదగా నిలుస్తాయని మళయాళీలు నమ్ముతారు. బయటి వెలుగు, స్వచ్ఛమైన గాలి కోసం వారి మనసుల తలుపులు ఎల్లప్పుడూ తెరుచుకొనే ఉంటాయి. నిరంతరం రూప ప్రతిరూపాలు సంతరించుకుంటూ ఉండే బాహ్యజగత్తు, సాహిత్యక ఉద్యమాల సంపర్కంలో ఉన్నప్పుడే మన సాహిత్యం ప్రస్ఫుటిస్తుందని, ప్రాణశక్తిని సంపాదించుకో గలుగుతుందని నా నమ్మకం.

ఈ గొప్ప తరుణంలో ఒక విహంగమ దృష్టితో నా సాహిత్య జీవితంలోని తొలి రోజులను చూడడం చాలా సహజంగా చేసే పని. నేను రచయితనెలా అయ్యాను? ఈప్రశ్న ఈరోజు కూడా నన్ను ఆశ్చర్యంలో పడేస్తుంది. సాహిత్యం గానీ, సాహిత్య సంప్రదాయం గానీ ఎంతమాత్రం లేని పేద రైతు కుటుంబంలో నేను పుట్టాను. ఆ చిన్న పల్లెటూళ్ళో జాగృతి లక్షణం ఒక్కటి కూడా లేదు. అక్కడికి అన్నిటికంటే దగ్గరి బస్సుస్టేషను ఆరు మైళ్ళ దూరంలోనూ, అన్నిటికంటే దగ్గరి రైల్వేస్టేషను ఐదు మైళ్ళ దూరంలోనూ ఉండేవి. హైస్కూలు ఏడు మైళ్ళ దూరంలో ఉండేది. గ్రామవాసులు ఎషుతాచన్ రచించిన ఆధ్యాత్మరామాయణం తడబడకుండా చదవగలిగినవాని చదువు పూర్తి అయిపోయినట్లే అని నమ్మేవారు. ఒడ్డున ఉండే పచ్చటి వరి పొలాల్లో తలదూర్చకుండా పశువులను నది దాకా తోలుకెళ్ళగలిగిన పిల్లవాడు పొలం పనులకు బాగా పనికొచ్చేవాడుగా భావించబడేవాడు. ఆ తర్వాత పిల్లలను హైస్కూలు, కాలేజి వరకు చదివించడం అవసరమనే అభిప్రాయం ఏర్పడగానే కడుపు మాడ్చుకొని కూడా నన్ను మరింత చదివించి మా పెద్దలు పల్లెలో ఒక కొత్త పరిపాటికి శ్రీకారం చుట్టారు.

నా ముగ్గురు అన్నలు ఏదైనా పుస్తకం లేదా పత్రిక తీసుకొని వస్తే నేను కూడా దాన్ని పైపైన చూస్తూ ఉండేవాణ్ణి. కవి చంగమపుళా రచించిన దీర్ఘకవిత 'రామానన్' కేరళ ప్రాంతమంతటా

---

డాక్టర్ జె. లక్ష్మిరెడ్డి, ఢిల్లీ యూనివర్శిటీలో హిందీ ఆచార్యులుగా పదవీ విరమణ చేశారు. నివాసం న్యూఢిల్లీ.

జనాదరణ పొందినప్పుడు దగ్గరి పల్లె నుంచి దాని ఒక లిఖిత ప్రతి మా చేతికందింది. మరుసటిరోజే తిరిగి ఇచ్చే షరతు పైన ఆ ప్రతి నాకు ఇవ్వడం జరిగింది. నా అన్నలు, వదినె రాత్రి నిద్రపోకుండా దాని నకలు తయారుచేస్తూ ఉండడం నేను చూశాను. ఇంత శ్రమ, సమయం వెచ్చించడానికి ఆ కవితలో ఏ విశిష్టత ఉందో, అప్పుడు నాకు బోధపడలేదు.

తర్వాత నేను కవిత్వం చదవడం మొదలుపెట్టాను. మొదట మళయాళంలోని సాహిత్య త్రిమూర్తులు - వళ్ళత్తోల్, ఆశాన్, ఉళ్ళూర్‌ల రచనలు చదివాను. మా అన్నలు చంగమపుళా, గోవింద శంకర కురుప్, వ్యాల పిల్లీ, బాలామణి అమ్మ, ఎదస్సెరీ, పి.కున్హిరామన్ నాయర్‌ల సంపుటాలు తెచ్చి ఇచ్చారు. ఈ కవులు నాకు తెలిసినవే అనేక పదాలు ప్రయోగించినా ఆ పదాలను పంక్తిబద్ధం చేసి వారు సృష్టించిన అద్భుత ప్రపంచం నాకు గొప్ప ఇంద్రజాలంలాగా కనిపించింది. నేను ఎన్నో కవితలను కంఠస్థం చేసుకుని, వాటిని వల్లిస్తూ, పాడుతూ మైదానాలు, కొండలు దాటేవాణ్ణి. ఆ తర్వాత నేను బశీర్, తకళి, పొట్టెక్కాట్, పొనకున్నమ్ వార్కీ, కరూర్, కేశవదేవ్, లలితాంబిక అంతర్జానం, పి.సి.కుట్టికృష్ణన్ మొదలైన వారి కథలు చదివాను. చదివి ఇక రచయితల భక్తుణ్ణయిపోయాను. పాత పత్రికల నుండి వారి చిత్రాలు కత్తిరించి మా ఇంటి మట్టి గోడలపైన అంటించడం మొదలుపెట్టాను.

నేనొక మంచి విద్యార్థిననే చెప్పాలి. ఆ రోజుల్లో నన్నెవరైనా "జీవితంలో నీవేమి కావాలను కుంటున్నావు?" అని అడిగితే మెల్లగానే అయినా, తక్షణం "రచయితను కావాలనుకుంటున్నాను" అని జవాబిచ్చేవాణ్ణి. నేను అంతే కోరుకునేవాణ్ణి. నా ప్రార్థన కూడా అదే.

పద్నాలుగేళ్ళ వయసులో నేను నియమంగా రాయడం మొదలుపెట్టాను. కవితలు, కథలు, వ్యాసాలు, ఏకాంకికలు కూడా. ఏ పత్రికల అడ్రసు తెలిస్తే ఆ పత్రికలకు వాటిని పంపేవాణ్ణి. ఆ రోజుల్లో పోస్టేజి కోసం మూడు పైసలు సంపాదించడం కూడా గగనంగా ఉండేది. నిజానికి ఈ కార్యకలాపాల్లో సతమతమవుతూ ఒక పక్కా పల్లెటూరి మనిషినైన నేను రచయిత కావడానికి ప్రాణాలొడ్డి ప్రయత్నిస్తున్నాననే విషయం ప్రపంచానికి మెల్లగా చెప్పాలనుకున్నాను. అప్పుడు ఏదో అపరిచిత స్వరం వినిపించినట్లయేది, "అవు, అయిచూపించు", అని.

కవిత్వపు ఇంద్రజాలం నాశక్తికి మించిందని అర్థంకాగానే నేను కథల వైపుకు మళ్ళాను. కొన్ని అచ్చయాయి కూడా. ఒక రోజు హఠాత్తుగా నా అంతరాత్మ ప్రశ్నించింది. "నీవు రాయడం మొదలుపెట్టావు, బాగానే ఉంది. కానీ, దేన్ని గురించి రాస్తావు?" అని.

రచయిత ఆంతరిక సంఘర్షణ ఇక్కడే మొదలవుతుంది. విషయం ఎన్నుకోవడమే ఈ సంఘర్షణ. ఏ ఆలోచననైతే మీరు విలువైనదిగా భావించి మెదడులో జాగ్రత్త పరచుకొని ఉంటారో, అదే అభివ్యక్తమైనప్పుడు దాని పట్ల మీ ఆసక్తి తొలగిపోయి దాన్ని మీరు పూర్తిగా వదలేస్తారు.

ఏదైనా విషయాన్ని ప్రధానమైందని భావించి స్వీకరించినప్పుడు రచయిత ఇంతకంటే పెద్ద సంఘర్షణలను ఎదుర్కోవలసి ఉంటుంది. వస్తువు, ప్రక్రియ ఈ రెండింటి విషయంలో కూడా అతని సంఘర్షణ నిరంతరం సాగుతూ ఉంటుంది. అతని మూలాలు సంప్రదాయాల్లో కూడా ఉండటం వల్ల చిత్ర - విచిత్రమైన వాటి రూపాల్లో అతడు చిక్కుకొని ఉండిపోతాడు. ఏ సంప్రదాయాన్నైతే అతడు ఇంతకాలం మనసారా గౌరవిస్తూ వచ్చాడో, దేని కొత్త పార్శ్వాల అన్వేషణలో అతడు లీనమవుతూ ఉండినాడో, దాన్నుండి అతడు వేరు కావలసి వస్తుంది. కొత్తగా నిర్మించిన

దారుల్లో ఎగుడు - దిగుళ్ళు ఎక్కువగా ఉంటాయనీ, ప్రమాదాలైతే ఉండనే ఉంటాయనీ, అతనికి తెలుసు. అయినా అతడు వాటిని కొత్తగా నిర్మించవలసే ఉంటుంది.

దీన్నుండి ఏదైనా సందేశం లభిస్తుందా? అని ఆలోచించి కనీసం సృజన చేసేప్పుడైనా అతడు తనకు తెలియకుండానే ఉత్కంఠాభరితుడుగా ఉండి తీరుతాడు. అతని పట్ల ప్రేమపూరితమైన సహానుభూతి కలిగి ఉండడం వల్ల నిష్ఠగల పాఠకులు కొందరు అతని వైఫల్యాలను, బలహీనతలను ఉపేక్షిస్తారని అనుభవం ద్వారా అతనికి తెలుస్తుంది. వాళ్ళు అతని రచనను తమ హృదయంలోకి తీసుకొని, దానికి తమ అనుభవం కూడా చేర్చి, దానికొక కొత్త కళాకృతి రూపం ఇస్తారు. అలాంటి పాఠకుల సంఖ్య తక్కువ కావచ్చు. కానీ, పదాలు వాళ్ళ మెదడులోకి చేరి తమకొక చోటును ఏర్పరచుకోవడానికి ప్రయత్నించినప్పుడు వాళ్ళు దాన్ని ఏ విధంగా స్వీకరిస్తారు, అనేది మరో సంఘర్షణ. రచయిత దీన్ని అనుభవించవలసి ఉంటుంది.

నాట్యశాస్త్రంలో భరతముని ఒక మాట రాశాడు. అభినయం చేసేటప్పుడు కళాకారుడు ఎదుట కూర్చున్న ప్రేక్షకుల సమూహానికి అతీతంగా ఒక దివ్య ప్రేక్షకుడు కూడా అక్కడ ఆ అభినయం చూస్తూ ఉన్నాడు, అనేదాన్ని మరిచిపోకూడదు అని. అదే విధంగా వివేకవంతులైన పాఠకులందరు కూడా ఓర్పుతో చూస్తూ ఉంటారు. వాళ్ళు మీ దోషాలను సరకుచేయరు. ఎందుచేతనంటే ఎప్పుడో ఒకప్పుడు మీరు వాళ్ళను తప్పక సంతృప్తి పరుస్తారని వాళ్ళు భావిస్తారు కాబట్టి.

సమానధర్ములైన నా అందరు సహరచయితల లాగానే నేను కూడా ఈ సంఘర్షణలను, ఉత్కంఠలను ఎదుర్కోవలసి ఉంటుంది. నేను ఏ సాహిత్య వాదంలోగానీ, సిద్ధాంతంలోగానీ పడను. నేను ఒక పండితుణ్ణనిగానీ, గొప్ప ప్రపంచజ్ఞానం ఉన్నవాణ్ణనిగానీ చెప్పుకోను. నేను నా జీవితంలోని ఆరు దశకాల కాలాన్ని ఒక చిన్న అనామక గ్రామంలో లేదా ఒక చిన్న టౌనులో గడిపాను. చిరపరిచితమైన నా ఈ గ్రామమే నా అనేక కథావస్తువులకు నేపథ్యం. ఇక్కడి నది నాలో ప్రాణచైతన్యం నింపుతుంది. మానవ ప్రవర్తనలోని మార్పుచెందే ఋతువుల నుండి నాకు ఎల్లప్పుడు ప్రేరణ లభిస్తూ వచ్చింది. మానవ ప్రకృతిలోని సంక్లిష్టతలు చూసి కూడా నాకు ఆశ్చర్యం కలుగుతూ ఉంటుంది. ఎవరినైతే మనం దయ, దాక్షిణ్యం, సౌజన్యం లేనివాడని భావిస్తూ ఉంటామో, అలాంటి మనిషిలో హఠాత్తుగా వినయం చూసి చకితులమై పోతాం. మన కళ్ళను మనమే నమ్మలేకపోతాం. ఎవరినైతే మనం ఎల్లప్పుడూ మంచికి ఆదర్శంగా భావిస్తూ ఉంటామో, అలాంటి మనిషి దుశ్చర్యలు చూసి కళ్ళప్పగించి చూస్తూ ఉండిపోతాం.

మానవుని స్థితిగతులను నా విషయవస్తువుగా చేసుకున్నప్పుడు నేను మానవుడు లాంటి సంక్లిష్ట ప్రాణిని అర్థం చేసుకోడానికి ప్రయత్నిస్తూ ఉంటాను. మానవుణ్ణి అర్థం చేసుకున్న తర్వాతే నేనుంటున్న సమాజాన్నీ, కాలాన్నీ నేను అర్థం చేసుకోగలుగుతాను. మానవ బలహీనతలను బహిరంగపరచి చూపడమే చాలదనీ, వాటిని సహానుభూతితో అర్థం చేసుకోవడం కూడా అవసరమనీ నాకు నేనే మాటిమాటికీ చెప్పుకుంటూ ఉంటాను.

గత జీవితం పైన దృష్టి నిలిపినప్పుడు నేనొక చిన్న భూమిముక్క, ఒక గుడిసె పట్టా పైన పొందిన రైతు లాంటి వాణ్ణని నాకనిపిస్తుంది. కొన్ని సంవత్సరాలుగా నేను నిరంతరంగా విశ్వవిఖ్యాతులైన రచయితల గొప్ప రచనల పారాయణం చేసే ప్రయత్నం చేస్తూ వచ్చాను. అవి నాకు కథకు సంబంధించిన విస్తారమైన మౌలికతలను అర్థం చేసుకోడానికి తోడ్పడ్డాయి. కథారూపాలు ఎంత విశాలంగా, వైవిధ్యభరితంగా ఉంటాయో, కథ శిల్పరచనా శైలులకు ఎంత వైవిధ్యం

ప్రసాదిస్తుందో, ఆ రచనలు బాగా తెలుపుతాయి. నా కళ హద్దులను నాకు నేనే స్వయంగా నిర్ధారించుకోవలసి ఉంటుందని కూడా అవి నాకు గుర్తు చేస్తూ ఉంటాయి. బలవత్తరమైన కథాంశాలు మనకు తప్పక కనిపిస్తాయి. అయితే ఈ కార్య రంగంలోకి దిగినప్పుడు మన సామగ్రి మనమే సేకరించుకోవలసి ఉంటుంది, మన శైలిని మనమే నిర్ధారించుకోవలసి ఉంటుంది. నా రంగానికి, నా కాలానికి, ప్రత్యేకమైన విత్తనాలు అవసరమని నా అంతరాత్మ నాకు చెప్తుంది.

కథ చెప్పే విషయంలో అత్యంత సమృద్ధవంతమైన మన స్వంత సంప్రదాయం ఒకటి మన దేశంలో ఉంటూ వచ్చిందని మనం తెలుసుకోవాలి. మన కథకుల దృష్టి కేవలం మనోవినోదం కలిగించడం పైనే కాక ప్రజలకు ప్రబోధం కలిగించడం పైన కూడా ఉండేది. తత్వశాస్త్రం, రాజనీతి, మనస్తత్వశాస్త్రం, వ్యవహార జ్ఞానం మొదలైన వాటిని బోధించడానికి వాళ్ళు కథను ఒక ప్రభావోత్పాదకమైన, వైవిధ్యభరితమైన మాధ్యమంగా మలచుకుని ముందుకు సాగారు. పంచతంత్ర రచయిత విష్ణుశర్మ ఒక సవాలును ఎదుర్కోడానికి కథా రచన చేశాడు. యువకులైన తన ఇద్దరు కుమారులను వ్యవహార కుశలురుగానూ, రాజకీయాల్లో పరిపక్వత గల వారు గానూ చేయమని అమరశక్తి రాజు కోరాడు. జ్ఞానం యొక్క ఒక్కొక్క విభాగాన్ని అధ్యయనం చేయడానికి కొన్ని సంవత్సరాల కాలం పడుతుందని ఆస్థానంలోని సలహాదారులు చెప్పారు. అప్పుడు ఈ పని ఆచార్య విష్ణుశర్మకు అప్పగించమని కింకర్తవ్య విమూఢుడైన ఆ రాజుకు ఒకరు సలహా ఇచ్చారు. ఇద్దరు పుత్రులకు తగినంత విద్య నేర్పడానికి రాజు విష్ణుశర్మకు కావలసినంత భూమి, ధనం ఇస్తానన్నాడు. అప్పుడు ఆయన ఇలా అన్నాడు, "నేను భూమి, ధనం తీసుకొని విద్య నేర్పేవాణ్ణికాను. కానీ, మీ కుమారులకు నీతిశాస్త్రం నేర్పకపోతే నా పేరుకు మచ్చ వస్తుంది. ఆరు నెలల్లోగా నేను రాజకుమారులకు జ్ఞానం యొక్క వేర్వేరు శాఖల్లో ప్రజల్లో అధిక సంఖ్యాకుల కంటే ఎక్కువ నిష్ణాతులుగా చేయలేకపోతే బ్రాహ్మణున్నయి కూడా ఈశ్వర ప్రాప్తికి మార్గం చెప్పే అధికారం వదలుకుంటాను." అప్పుడాయన పంచతంత్రం రచించాడని జనశృతి చెప్తుంది. అదే విధంగా నిరాశ చెందిన ఒక వితంతువు రాణిని ఉత్సాహపరచడానికి, ఆమె జీవితంలో ఆశాజ్యోతి వెలిగించడానికి సోమదేవుడు బృహత్కథను సంక్షిప్తీకరించి 'కథాసరిత్సాగరం' రచించాడని కూడా మనం వింటూంటాం.

క్లుప్తంగా చెప్పాలంటే, ప్రాచీన భారతీయ కథకులకు రెండు ఉద్దేశ్యాలుండేవి. ఒకటి, పాఠకునికి లేక శ్రోతను సంక్లిష్ట ప్రాపంచిక జీవితంలో నెగ్గుకు రావడానికవసరమైన జ్ఞానం ఇవ్వడం. రెండు, జీవితం పట్ల వారిలో విశ్వాసం కలిగించడం. ఈ రోజు కూడా కథాకారులకున్న బాధ్యత అదే అని మనమంటే వాస్తవానికి దగ్గరగానే ఉంటాం.

ప్రాచీన కథా రచయితల మూలోద్దేశ్యాలు ఈ రోజు తమ కాలానుగుణ్యాతను కోల్పోయి ఉండవచ్చు. జ్ఞానానికున్న అనేక శాఖోపశాఖల అంశాలు నేర్పడానికి కావలసినన్ని పాఠ్యపుస్తకాలు ఇప్పుడు తయారయ్యాయి. మనోరంజనం కూడా వేర్వేరు సాధనాల ద్వారా ఇప్పుడు లభ్యమౌతుంది. బటన్ నొక్కగానే ఈ సాధనాలు చకచకా తమ పని ఆరంభించేస్తాయి. ఉత్తేజం కలిగించే, రక్తం ఉడికించే కథల విషయానికొస్తే హత్యలకు, సామూహిక బలాత్కారాలకు, హవాలా కాండలకు, తదితర విషయాలకు సంబంధించిన రక్తసిక్త సమాచారాలను రోజూ ఉదయం మనకు అందించే వార్తా పత్రికలు ఆపని చేస్తూనే ఉన్నాయి.

ఇవన్నీ ఇలా ఉన్నా కూడా రచయిత తన పని చేసుకుంటూనే పోతున్నాడు. ఎన్ని రకాల కష్టాలున్నా, అతని కృషికి ఏమంత మెప్పు లభించడం లేదనే నిజం తెలిసినా. నలువైపులా జరుగుతున్న అన్యాయ

అత్యాచారాలకు అతడు ప్రత్యక్ష సాక్షి. రచయిత కావడం మూలాన అతని అనుభూతి ఇతరుల అనుభూతి కంటే ఎక్కువ తీవ్రంగా ఉంటుంది. సత్యానికి భంగం కలగడం వల్ల, మానవుని ఆత్మ గాయపడడం వల్ల జన్మించే వ్యథ అతణ్ణి ఉద్వేగభరితునిగా చేస్తుంది. శిఖరాగ్రం పైకి చేరాలనే యావలో మనం ఒకప్పుడు పవిత్రమైనవిగానూ, పావనమైనవి గానూ భావించిన సిద్ధాంతాలను కాలరాస్తూ వెళ్తున్నాం. శాసక వర్గానికి, శాసిత వర్గానికీ మధ్య సంఘర్షణ జరుగుతూంది. సంస్కృతి, అపసంస్కృతి మధ్య విరోధం పెరుగుతూంది. పాపానికి, ముక్తికి సంబంధించిన సిద్ధాంతాల, అపసిద్ధాంతాల మధ్య బలాబలాలు తెలుసుకునే పరిస్థితి ఏర్పడింది.

న్యాయం, సత్యం, మానవీయ గరిమ, వీటి ప్రశాంత క్షేత్రాన్ని చేరగలమనే ఆశతో ఈ ప్రభంజనాన్ని దాటి సాగిపోయేందుకు రచయిత ప్రతిజ్ఞాబద్ధుడై ఉన్నాడు. అందువల్ల పీడితుల, పీడకుల విషయంలో అతని ప్రశ్నలకు జవాబులు రాని పరిస్థితి ఉన్నా కూడా కొన్ని మౌలికమైన ప్రశ్నలు లేవదీయవలసిన బాధ్యత అతనికి ఉంది. సమాజం నుండి, ప్రకృతి నుండి, భగవంతుని నుండి కూడా అతని ఈ మౌనయాత్ర సాఫల్యానికి తోడ్పాటు లభిస్తుంది. అతని ప్రశ్నలు ఎదురు ప్రశ్నలుగా మారి తిరిగి వచ్చి అతని గుండె గోడలతో ఢీకొంటున్నాయి. ఇదంతా ఇలా ఉన్నా కూడా అతడు ప్రశ్నలు లేవదీస్తూ ఉండవలసిందే. ఎందుకంటే అది అతని నిబద్ధతకు సంబంధించిన కర్తవ్యం కనుక. తన నలువైపులా వ్యాపించిన కష్టాలను తొలగించేందుకు తక్షణ ఉపాయం అతడు సూచించలేడు. అతడే ప్రవక్తాకాడు. ఈ విషమతలను తొలగించడానికి చట్టబద్ధమైన ఏ అధికారము కూడా అతనికి లేదు. సమాజం నాడిపైన వేళ్ళుంచి దానికి తగినట్లుగా వైద్యం చేయగలిగే ఏ గొప్ప వైద్యుడు కూడా అతడు కాదు. అతని పని జీవన సంగీతాన్ని కూడా అపశృతిపాలుచేసి వేసిన కర్కశరాగం వైపు వేలెత్తిచూపడం మాత్రమే. అతడు తన చింతను, కోపాన్ని, వ్యథను సమానధర్ములైన తన తోటివారితో కలిసి అనుభవించాలని కోరుకుంటాడు. ఈ విధంగానే అతనికి కొంత శాంతి లభిస్తుంది.

నలువైపులా బజారులో లాంటి చెవులు పగలగొట్టే గోల వినిపిస్తూంది. ఇదే జీవితం. రచయిత దీని మధ్యనే నిలిచి ఉంటాడు. అతడి కంఠస్వరం ఢంకాలమోతలో మునిగిపోయే తీతువ అరుపులాగా మునిగిపోవచ్చు. కానీ ఆ గుంపులో అతని ఏకైక కంఠ స్వరాన్ని గుర్తించే ఆసక్తి కల వారు ఎవరో ఒకరు ఎక్కడో ఒక చోట ఉండాలి కదా!

ఇక భగవంతుడు దిగి వచ్చి రచయితతో ఇలా అడగడం కూడా జరగవచ్చు —— "నీకేం కావాలి?" అని. అప్పుడతడు నిబ్బరంగా ఇలా జవాబిస్తాడు, "జీవితం కంటే కూడా అందమైన జీవితం కావాలి!" అని.

## జీవితవిశేషాలు, సాహిత్య పరిచయం

ఎమ్.టి.వాసుదేవన్ నాయర్ రచనావస్తువు, ధోరణి, మూలాలు ఆయన ఆరంభిక జీవన పరిస్థితుల్లో మనం చూడవచ్చు. 1933 జూలై 15న పాలక్కాట్ జిల్లాలోని కూటల్లూర్ అనే మారుమూల గ్రామంలో, ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టిన వాసుదేవన్ నాయర్ కాలి బాటన మైళ్ళకొలది నడిచి తనకు కావలసిన పుస్తకాలు తెచ్చుకునే వారు. కుమనళూర్‌లోని హైస్కూల్లో చేరినప్పుడు పరిస్థితి కొంత మెరుగుపడింది. కారణం కవి అవికత్తమ్ నుండి విద్యావ్యసని బాలునికి చదవడానికి పుస్తకాలు దొరికేవి. ఈలోగా ఎమ్.టి.ఎవరికీ తెలియకుండా కవిత్వం రాయడం మొదలుపెట్టాడు. అయితే తర్వాత కవితా రచన మానుకున్నాడు. ఆర్థిక కారణాల వల్ల సంవత్సరం పాటు ఇంట్లో

ఉన్న తర్వాత పాలక్కాట్‌లోని విక్టోరియా కాలేజీలో చేరిన ఆయనకు చదివే-రాసే అవకాశాలు ఎక్కువగా లభించడం ఆరంభమయింది. బి.ఏ. తుది సంవత్సరంలో 'మాతృభూమి' పత్రిక ద్వారా నిర్వహించబడిన విశ్వకథా పోటీలో ఎమ్.టి. పురస్కారం, ఖ్యాతిపొందారు. విద్యార్థిగా ఉన్నప్పుడే ఆయన మొదటి కథాసంపుటి 'రక్తసిక్త ఇసుక' వెలువడింది. ఉపాధ్యాయుడుగా కొద్ది రోజులు పని చేసిన తర్వాత 'మాతృభూమి' వార్తాపత్రికలో పనిచేయడానికి వెళ్ళినప్పటికి కేరళలోని జాగరూకులైన పాఠకులకు వీరు పరిచితులై ఉండినారు. అప్పటికే అనావృష్టి, కరువు, తుపాను, కలరా వీటి నరకం ఎమ్.టి. తన చిన్న గ్రామంలోనే అనుభవించేడు. ఈ అనుభవాల ఆధారంగా రాసిన మొదటి నవల 'పూర్వీకుల ఇల్లు' (1954)లో కేరళలోని నాయర్ సముదాయంలో కొనఊపిరితో ఉన్న మాతృస్వామ్య కుటుంబ వ్యవస్థ చిత్రణ ఉంది. ఇందులోని అవమానం, ఆక్రోశం, పగ, ప్రతీకారం వీటికి సంబంధించిన భావనల సజీవ చిత్రణ గ్రామీణ మధ్యవర్గ యువత అనుభవాలకు చాలా దగ్గరగా ఉంది. అందువల్ల ఈ నవల ప్రజాదరణ పొందడమే కాక కేరళ సాహిత్య అకాడెమీ పురస్కారం కూడా పొందింది. సాహిత్య అకాడెమీ NBT ద్వారా అనేక భారతీయ భాషల్లో వెలువరించబడింది. ఆయన మరో నవల 'కాలమ్' (కాలము - 1969) కు 1970లో కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. ఆయన సర్వాధిక ప్రసిద్ధ రచన 'రాంటాభూషమ్' (రెండవ స్థానం) 1984లో వెలువడింది. ఈ పౌరాణిక నవల నాయకుడు భీముడు. గొప్ప యోగ్యత ఉన్నా దానికి తగిన గౌరవ ప్రతిష్ఠలు పొందలేకపోయిన భీముడు నేటి మానవుని మనోవ్యధకు, పరితాపానికి ప్రతినిధి.

ఎమ్.టి. కేవలం కథా రచయితే కాదు. ఆయన పురస్కారం పొందిన అనేక చలనచిత్రాలకు స్క్రీన్‌ప్లే కూడా రాశారు. రెండు చలనచిత్రాలకు దర్శకత్వం వహించారు. 'నిర్మాల్యమ్' (1973) చిత్రానికి ఆయన్కు రాష్ట్రపతి స్వర్ణపదకం లభించింది, మరోచిత్రం 'ఒరు వటక్కన్ వీరగాథ' (1989)కు జాతీయ పురస్కారం లభించింది.

ఇప్పుడు ఎమ్.టి. స్థితి ఒక ఆరాధ్య రచయిత స్థితి లాంటిది. యువతపైన, విదేశాల్లో నివసిస్తున్న మళయాళీల మనసుపైన ఉన్న ఆయన ప్రభావాన్ని కవి చంగమపుళ ప్రభావంతోనే పోల్చడానికి వీలుంది. ఆయన తన పల్లె కథను ప్రతిచోట కథగా మార్చేస్తారు. దైనందిన జీవిత చిత్రకారుడుగా ప్రతి అనుభవాన్నీ అనేక కోణాల నుండి చూస్తాడు, యధార్థాన్ని చూసే తన పద్ధతిని సంస్కరించుకుంటూపోతాడు.

ఎమ్.టి.వాసుదేవన్ నాయర్ తన అన్ని రచనల్లో సామాన్య వ్యక్తుల మనోవ్యధ పట్ల తన సంవేదన వ్యక్తం చేశారు. ఆయన మానవస్వభావాన్ని మనోవైజ్ఞానిక దృష్టితో చూసే, పరీక్షించే ఆధునికతావాది.

ఎమ్.టి.వాసుదేవన్ నాయర్ ఇప్పటికి 18 కథాసంపుటాలు, 8 నవలలు, 3 విమర్శా రచనలు, 3 విమర్శకు సంబంధించిన రచనలు, 2 యాత్రా వృత్తాంతాలు, 1 నాటకం, 2 బాలసాహిత్యానికి సంబంధించిన రచనలు, వెలువరించారు.

ఆయన పొందిన పురస్కారాలు - సన్మానాల్లో కొన్ని :

'మాతృభూమి' (వార్తాపత్రిక) ద్వారా నిర్వహించబడిన విశ్వకథల పోటీలో మొదటి బహుమతి (1953), కాలమ్ (1970) కి కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం, 'రంటాభూషమ్' (రెండవ మలుపు నవల) కు వలయార్ పురస్కారం, 1975-94 మధ్యకాలంలో మళయాళంలో ఉత్కృష్ట సాహిత్య సృష్టి చేసినందుకుగాను జ్ఞానపీఠ పురస్కారం.

# చార్లీ చాప్లిన్ : అంతరంగం

- వల్లభనేని అశ్వినికుమార్

అతనే కథకుడు, అతనే దర్శకుడు, స్వరకర్త, నటుడు కూడా! ఒకే పాత్ర (వ్యక్తి!) Tramp! బాగీపాంటు, టైటుకోటు, హిట్లరు మీసాలు, పెద్ద బొట్టు, వంకీ చేతి కర్ర - నిరుపేద బ్రతుకు - నవ్వుల జల్లులు. అడపాదడపా ఓ కన్నీటి బొట్టు!

అతను ఎలిమెంటరీ స్కూలు దాటి చదవలేదు - ఎటువంటి శిక్షణ పొందేందుకు పేదరికం - పొట్టగడవని పరిస్థితి. అమ్మతో పదేళ్ళ పిల్లవాడిగా స్టేజి చుట్టూ తిరిగినా వేషాలు ఎవరూ ఇవ్వలేదు. ఏక్షన్ - ఆడిషన్‌కూ అవకాశమే లేదు - అయినా...

ఒక ఫినామినాగా, మేధావి విదూషకునిగా, గొప్ప దర్శకునిగా, తర్వాత కథ, స్క్రిప్టు రచయితగా, మూకీ నుంచి టాకీ వరకు రెండు ప్రపంచ యుద్ధాల చరిత్ర కాలంలో మారణ రోమపు కమురు కంపులోని విషాద ఛాయల నేపథ్యంలో -

కొన్ని భగ్న ప్రేమలు, మూడు పెళ్ళిళ్లు, రెండు విడాకులు - ఒక స్కాండల్ - బ్లాక్ మెయిల్, క్రిమినల్ కేసులు, ఇలా **40** సంవత్సరాల పాటు సాగిన జైత్ర యాత్రలో చిన్నా, పెద్దా **80** చిత్రాలలో **90** శాతం విజయాలతో 'మిలియనీర్ ట్రాంప్' గా ఎదిగి, అమెరికా అధ్యక్షుని కోసం ప్రచార ప్రసంగాలు చేసి, 'The Dictator' తీసి యాంటీ నాజీగా, సోషలిస్టుగా, కమ్యూనిస్టుగా ముద్ర వేయించుకొని, అదే "అంకుల్ శ్యామ్"తో 'Mr. వోర్డాక్స్' సినిమాతో యాంటీ కాథలిక్‌గా క్రాస్ వేయించుకొని, అప్పటి మత ఛాందసుల వత్తిడితో అమెరికా దేశపు చట్టాల చట్రంలో, ఇరుక్కొని, దాదాపు ఇరవై సంవత్సరాల శిక్షకు కారాగార గుమ్మంలో నిలబడి - అదృష్ట వశాత్తు బైటపడి అమెరికా దేశం నుంచి దాదాపు తరిమి వేయబడిన బ్రిటిష్ పౌరునిగా, ప్రపంచంలో మహామహుల సాన్నిధ్యంలో విందులు, వినోదాలు పంచుకుని, మేధావులతో భుజాలు రాసుకుని, దేశాధినేతలతో - రాణులతో, యువరాజులతో ఓపేరాలు చూసి అహంకారం పొడసూపని ఆత్మవిశ్వాసంతో, సంపదను పరాయిదానిగానే చూసి, అపారమైన కీర్తిని తలకెత్తుకొని, అసంగతమైన అపఖ్యాతిని మూటగట్టుకొని, చివరికి స్విట్జర్లాండ్ పర్వతసానువుల్లో తన చిన్నారి భార్య ఒడిలో, అయిదుగురు పిల్లలతో ఒదిగి, మనకు అందించిన ఈ అద్భుతమైన గ్రంథం, చార్లీ స్వీయ కథలో నుంచి కాల పరీక్షకు నిలబడే, ఆయన అభిప్రాయాలు - అనుభవాలు కొన్ని మీముందుంచుతున్నాను-!!

ఈ పేదరికపు లేమిలో నుంచి 'నేను' జనించాను. ఈ నైరశ్యపుటాకాశపు నీడలోనే నిలబడి పోరాడాను.

"అమ్మ"! ఎలాంటి అమ్మ! ఈ ప్రపంచంలో ఎవరికైనా, ఎప్పటికైనా ఇలాంటి అమ్మ వుంటుందా? ఈ కరుణామయి వెలిగించిన వెచ్చటి దీపం కాదా నా ఉనికి - ఆమె ప్రేమ, లేమి - ఇదే నా దిన చర్య!

జీవితం చాలా చిన్నది - ఎందుకు దీని కోసం కొట్లాట? హృదయం ఎంతో విలువైనది - ఎందుకు దానిని పగలకొట్టుకోవటం?

చరిత్ర అంటే ఏమిటి? నరమేధపు సిరాతో రాసిన రికార్డు కాదా? హింస, మారణ హోమపు చర్మం కాలిన వాసన కాదా? దేశాలు - సరిహద్దులు కేవలం రంగు రంగుల మ్యాపులకే పరిమితం!

కవిత్వమంటే జ్ఞాపకాలే, ప్రపంచానికి ఒక ప్రేమలేఖ!

---

వల్లభనేని అశ్వినికుమార్, రచయిత, జర్నలిస్టు, విజయవాడ.

*If poetry is love letter to the world,*
*You are my world, wonderful small world !*

మీకు తెలుసా, చాలా పేరు గడించిన హాస్యనటులు - చివరికి ఆత్మహత్య చేసుకున్నారు? నటన ఒకరు నేర్పేదా? సాంకేతిక విషయాలే నేర్పగలరు - సృజన స్వయంకృషే !

అమ్మ అనేది - నాయనా, ఎంత ఒంగినా, ఎంత లొంగినా ఈ ప్రపంచంలో ఒకోసారి ఏమీ దొరకదు - అని.

అన్నయ్య ఆఫ్రికా వెళ్తూ - ఈ ప్రపంచంలో నాకు - నువ్వు, నీకు - నేను ఉన్నామని మరచిపోకు - ఉత్తరం రాస్తుండు, అని. ఇంతటి పేదరికంలో, ప్రకృతే మాపై సానుభూతి చూపుతోంది. ఈ వేసవి ఒక శూన్యంలో ఆవరించింది - ఎండమావులే నింపింది. పేదరికం నిర్లక్ష్యాన్ని, నైరాశ్యాన్ని నింపి బ్రతుకంటే చేదుగా పరుస్తుంది.

ఏ కోరికా లక్ష్యం పవిత్రంగా వుండవు. కర్కశమైన ప్రపంచపు వైఖరిని తట్టుకునేందుకే సామాన్యులకు లౌకిక జ్ఞానం కావాలి!

సంపద వలన కలిగే సౌఖ్యం చాలా నమ్మకం కలిగిస్తుంది. అందులోనే ఎంతో ఖరీదైన విషాదమూ వుంటుంది!

ఒక్కోసారి నా జీవితంలోని బాధలూ భయాలూ కలగలసి ఒక్కసారే కళ్ళ ముందు కదులుతాయి!

అన్ని - ఆనందమైన విషయాలకూ అంతం వుంటుంది.

మళ్ళీ పదేళ్ల తర్వాత లండన్ తిరిగి వచ్చాను. నా బాల్యపు గురుతులన్ని చెరిగిపోతున్నాయి. అభివృద్ధి పేరుతో చక్కని అందమైన చారిత్రక కట్టడాలను కూల్చి - అగ్గి పెట్టెల్లాంటి ఆకాశ హర్మ్యాలను కడుతున్నారు.

ఇక ముందు నా గతాన్ని వెతుక్కుంటూ ఇక్కడకు రావలసిన అవసరం లేదేమో!?

ఆ వీధిలో **834** ఇంటి ముందు ఆ మధ్యాహ్నం చాలా సేపు నిలబడ్డాను - ఆమె బైటకు వస్తుందేమో, లేక బైట నుంచి లోపలకు వెళ్తుందేమోనని ఆశతో - చివరికి నిరాశతో - దూరంగా వున్న రెస్టారెంటులో కూర్చున్నాను. అక్కడ సర్వ్ చేసే అమ్మాయి నన్ను గుర్తుపట్టి - మెల్లగా అందరికీ చెప్పింది. త్వరలోనే గుంపుగా జనం పోగయినారు (చార్లీ-చార్లీ అంటూ) అతి కష్టం మీద - తప్పించుకొని బైట పడ్డాను.

చూశారా, మనకు వున్నది వేరు; మనకు కావలసింది వేరు!

ఆ రోజు టైమ్స్ స్క్వేర్‌లో నిలబడ్డాను. వెలిగే దీపాలతో "చార్లీ చాప్లిన్, సినిమా కంపెనీతో ఏడున్నర లక్షల డాలర్ల ఒప్పందం --" అని కదలిపోతుంది. ఇదేదో నాకు సంబంధించినది కాదనుకుంటూ కదిలిపోయాను - పేదరికం లాగానే, సంపద కూడా భయపెడుతుంది. నా భావావేశం అంతా ఆవిరై పోయింది!

ఈ ప్లాస్టిక్ ప్రపంచంలో - పేదరికం ఎంత జుగుప్సాకరమైన కఠోర సత్యమో, సంపద కూడా అంత వికారమైన నగ్నసత్యం!

మనిషిలోని సహజగుణంతో - రెంటి నుంచీ పారిపోవాలనే ప్రయత్నిస్తాడు!

ఒంటరితనం - విచారం లాంటిది, వికారం లాంటిది, ఒక రకంగా సిగ్గుపడవలసింది - కాని ఇది అందరికీ తప్పని పరిస్థితి!

సంపద మరచిపోవటానికి, గుర్తుంచుకోవటానికే, అది కనపడదు. అంకెలు, సామానులు - అవసరానికి మించిన సామానుల్లోనే తప్పు!

ఆమె ప్రవేశించగానే తెల్లని గులాబిరేక లాగా, వెలసిన వెలుతురు గీతలాగా అన్పించింది! ఆమె నాట్యం చేస్తుంటే, ఆమె చుట్టూ గురుత్వాకర్షణ వున్నట్లు, కదిలే విషాద శిల్పంలా తోచింది. ఉషోదయాన్ని ఒంటరిగా కంటే, నెచ్చెలి దగ్గరగా వుంటే ఆ వెచ్చదనం వేరు!

ఎన్ని సార్లో అనుకున్నా - ఈ జీవితానికి ఏ అర్థమూ లేదని!

లిలీపూవులో బందీనైనట్లు భయపడ్డాను!

ఫ్రాయిడ్‌తో నాకు పేచీ ఏమిటంటే - మన నడవడికకు, మానసిక పరిపక్వతకు సెక్స్ కారణం కాదనుకుంటా - ఇంకా ఎక్కువ ప్రభావం చూపేవి, ఆకలి, అవమానకరమైన పేదరికం, భరించలేని చలికాలం!! లైంగిక క్రియకంటే, అందుకు ప్రేరణ కలిగించే శృంగార ప్రక్రియ, వాతావరణం ఎక్కువగా ఆనందం కలిగిస్తుంది!

ప్రియురాలిని కలవాలని ఆతృతగా లండన్ వస్తుంటే ఎవరో చెప్పారు, 'బెట్టి' చనిపోయిందని. "అయ్యో, నా అనుభవాన్ని ఎవరో దొంగిలించారు, నా అనుభూతినెవరో దోచుకుపోయారు" అని విలపిస్తాడు!

నా ఏకాంతాన్ని, నా విచారాన్ని చాలామంది ఎగతాళి చేశారు. సోమర్‌సెట్ మామ్ కూడా ఈ విషయంలో నన్ను సరిగా తెలుసుకోలేదు -

బహుశా స్నేహాన్ని గూర్చి నా అభిప్రాయం తెలీకనే - పేరు ప్రఖ్యాతులతో అడక్కుండానే మిత్రులు వస్తుంటారు. పరిచయాలు పెరుగుతుంటాయి. కాని ఒక వ్యక్తికి ఎంతమంది స్నేహితులు కావాలి?

స్నేహం సంగీతం లాంటిది - మనకు చక్కని 'మూడ్' వుంటే అది సాగుతుంది. దాని అవసరం కూడా!

అవసరంలో ఉన్న స్నేహితునికి సహాయం చేయవచ్చు. అదే మన సమయాన్ని వెచ్చించాలంటే అవకాశం వుండకపోవచ్చు కదా!

నా హృదయానికి దగ్గరైన వ్యక్తులు, నాకెంతో సంతోషాన్ని కలిగిస్తారు - నా సాయంత్రాలను వెలిగిస్తారు! పేదరికాన్ని ఆకర్షణీయంగా చేయగలమా? పేదరికంలో వున్నవానికి అది తప్పని సరి పరిస్థితే గాని, ఇష్టపడి వుండేది కాదుకదా!

సంపద, కీర్తి నాకు వ్యక్తుల్ని, ముఖ్యంగా ప్రముఖుల్ని దగ్గరగా చూసే అవకాశం కలిగించింది.

వారు కూడా సామాన్యులకు భిన్నం కాదు అని తెలుసుకోగలిగాను!

'మెకాలె' లాగా, నేను మత విశ్వాసాలను మూఢంగా నమ్మను - ఏ మత సిద్ధాంతమూ కాల పరీక్షకు నిలబడవు. వేయి సంవత్సరాలనాటి మత విశ్వాసం. తర్వాత శాస్త్రీయ పరిజ్ఞానంతో 'పాత'బడి పోతుంది.

అలాగే - నేను ఏ సిద్ధాంతానికి కట్టుబడిలేను. అమెరికన్ ఇమిగ్రేషన్‌లో "నలభై సంవత్సరాలుగా అమెరికాలో వుంటూ పౌరసత్వాన్ని ఎందుకు తీసుకోలేదు?" అని "నీ పౌరసత్వం ఏది?" అన్నాడు-

"నేను ప్రపంచ పౌరుణ్ణి" అని చెప్పాను - "సాంకేతికంగా అది సాధ్యం కాదు" అన్నాడు - తర్వాత నేను అమెరికా వెళ్ళ లేదు!

స్త్రీ వాద ప్రాతిపదిక నాటకంలో -

"ఇందులో వాదానికే ముంది, ఆడవాళ్ళే కదా, తమకు కావాల్సిన వాడిని ఎంచుకుంటారు."

"అలా ఎందుకు, మనమే కదా ఇష్టపడి ఎంచుకుంటాం?"

"అక్కడే వుంది కిటుకు, వాళ్లు ఎంత తెలివిగా వ్యవహరిస్తారంటే, అంతా మనకు, మన ఇచ్ఛ ప్రకారమే జరుగుతుందని భ్రమలో ఉండిపోతాం!"

తర్వాత ఆడవాళ్ళు నన్ను నమ్మటం మానేశారు!

లండన్‌లో గాంధి మహాత్ముని కలిసినపుడు - ఆయన ఒక దార్శనికుడు - చురుకైన, తెలివైన మేధావి, మొక్కవోని ధైర్యంతో భారత ప్రజలకు ఎంతో స్ఫూర్తినిచ్చే వ్యక్తి - ఆ నూలుపంచెలో ముడుచుకుని, "హింస, చివరికి తననే నాశనం చేసుకుంటుంది" అన్న సందేశం, సదా ఈ ప్రపంచానికి వర్తిస్తుంది.

స్విస్‌లో వున్నపుడు, నెహ్రూ నన్ను కలవాలని "లేడీ మౌంట్‌బాటన్" పరిచయ లేఖ పంపారు -

ఆయన కూడా నాలాగా పొట్టివాడు - కాని ఎంతో చలాకీగా ప్రపంచ రాజకీయాలంటే ఆసక్తిగా వున్నవాడు. ఆయనతోపాటు ఇందిర కూడా వచ్చింది - ఎంతో ఛార్మింగా ఉంది.

"మీ దేశాన్ని ఏ ప్రాతిపదిక మీద అభివృద్ధి పరుస్తారు" అని అడిగాను (ఆయన సోషలిస్టు భావాలు తెలిసే). "అభివృద్ధే ప్రాతిపదిక, అప్పుడే పంచవర్ష ప్రణాళిక మొదలు పెట్టాం" అని ఉత్సాహంగా అన్నారు.

రాజకీయాలు అంటే చరిత్ర కాదు - ఆర్థికపరమైన ప్రణాళికలు - ప్రయోగాలే!

ఈ అభిప్రాయాలే కృశ్చేవ్, చౌ-ఎన్-లై, చర్చిల్, ఫ్రెంచ్ ప్రెసిడెంటు; జపాన్ ప్రధాని కొడుకుని కలిసినపుడు వ్యక్తమైనాయి.

ఆస్కార్ వైల్డ్ - చాలా మార్మికంగా, "చివరికి ప్రతివాడు, తాను ప్రేమించినదాన్ని నాశనం చేస్తాడు" అనేవాడు! పునరుత్పత్తి ప్రకృతి నైజం కాబట్టి ప్రతి వ్యక్తి, వయసుతో నిమిత్తం లేకుండా, స్త్రీని కలిసినపుడు, లైంగిక వాంఛ కలగటం అతి సహజం! ఇందుకు ఎవరు మినహాయింపు?

ప్రొద్దున్నుంచీ ఎంతో వ్రాశాను; మధ్యాహ్నం ఉత్తరాలకు సమాధానాలు పంపాను - సాయంత్రం బీచ్‌లో నడక కూడా అయింది - ఈ చలిమంట దగ్గర ఓ గ్లాసు వైను తీసుకున్నాను. మరి ఇప్పుడేకదా - శృంగారానికి సమయం?" అని H.G. Wells అంటుండేవాడు.

"నాకు మతపరమైన నమ్మకాలు, భ్రమలూ ఏమీ లేవు.

"మతం లేని సాహిత్యం గాని, శిల్పం గాని, కళాకృతుగాని ఎలా వుంటాయి?"

"నా వుద్దేశ్యంలో మతమంటే మూఢనమ్మకము"

కళా సృష్టి విశ్వాసాన్ని మించిన సంవేదన, అనుభూతి.

హిట్లర్ చివరి ఉపన్యాసం తర్వాత -

"ఈ జీవితంలో ఏదీ శాశ్వతం కానట్లే,
ఈ ఉపన్యాసం కూడా ముగిసింది!"

సార్త్రే ఎంతో మార్మికపు గుండ్రని ముఖంతో తెలివైన కళ్ళతో నిశ్శబ్దంగా సంభాషిస్తాడు!

పికాసో ఒక పిచ్చివాడిలా అన్పిస్తాడు. ఆయన పాత మురికి స్టూడియోకి తీసుకువెళ్ళాడు. ఒక చెత్తకుండీ క్రింద బంగారు గని ఉందని కనిపెట్టాను! అద్భుతమైన కాన్వాసులు చెల్లా చెదురుగా పడవేసి వున్నాయి!

మేధావులకు ప్రపంచమంటే ఎంత ప్రేమ వుంటుందో తమ మీద తాముకు అంతకంటే ఎక్కువ ద్వేషం పెంచుకుంటారేమో!

విజయం సాధించిన వ్యక్తులు - ఒక ప్రత్యేక పరిధిలో జీవిస్తారు.

నా జీవితంలో, నేను అనుభవించిన పేదరికం కంటే సంపాదించిన సంపదలకన్నా, నెత్తికెత్తుకున్న కీర్తి కంటే, మూటగట్టుకున్న అపఖ్యాతికి మించి, నాకు ఫ్రెంచ్ మేధావులు, రచయితలు, కళాకారులు ఇచ్చిన పురస్కారం ఎంతో ఘనమైనది! విలువైనది. ఉన్నతమైనది!

"........ నీవు ప్రపంచానికి పంచిన ఉన్నతమైన భావావేశాలు, మానవాళి సంబంధ బాంధవ్యాలు హాయిగా నవ్వుకుంటూ, మనసారా కన్నీరు పెడుతూ అనుభవించాం! నవ్వటం ఎంత విలువైనదో, కన్నీరు - అంతకంటే విలువైనదని చూపావు. నీ కథల్లో, సంగీతంలో, నీ జీవితంలోని పేదరికాన్ని, బాధల్ని, బాంధవ్యాల్ని, ఆశల్ని, నిరాశల్ని ఎంతో నిజాయితీగా మాకు అందజేసి - అంతర్ముఖుల్ని చేసావు. నీ హాస్యంతో అరక్షణం ఈ బాధల్ని మరచిపోయినా, అంతర్లీనంగా వున్న వేదనే మమ్మల్ని నిజంగా ఓదార్చింది!

"నీ బాల్యం గాని, నీ యౌవనం గాని, నీ బీదరికం గాని, నీ సంపద గాని, నిన్ను మించి పోలేదు! చివరకు నీ కీర్తి కూడా!

అన్నిటికీ దూరంగా, ఎత్తుగా నిలబడి, ఈ జీవితాన్ని, ప్రపంచాన్ని చూడగలిగావు!

"నీవు కథకుడవు, సంగీత దర్శకుడవు, నటుడవు కూడా - అద్భుతమైన నటుడవు సుమా!

"కేవలం నీ ప్రతిభతోనే ప్రశ్నలకు సమాధానం చెప్పావు - విమర్శకుల నోళ్ళు మూయించావు. ఎవరినీ అనుకరించకుండా, నిన్నెవరూ అనుకరించ నీయకుండా వుండగలిగావు!

'ఇదిగో ఇక్కడ వున్న ఫ్రెంచ్ రచయితలు, నాటిక, చలనచిత్ర దర్శకులు, నిర్మాతలు, స్వరకర్తలూ, అందరూ నిన్ను ప్రేమిస్తున్నారు - వారి వారి స్వీయ వృత్తుల వలెనే!

ఈ పురస్కారం, మేము సగర్వంగానే కాదు - ప్రపంచ ప్రజలకు త్యాగపూరితమైన నివాళులతో..."

గత ఇరవై సంవత్సరాలుగా సంతోషమంటే, ఆనందమంటే ఏమిటో తెలుసుకోగలిగాము.

నా అదృష్టం - నన్ను ప్రేమించే నా భార్య "ఊనా."ఆమెతో రోజులు గడుస్తున్న కొలదీ ఆమె అంతఃసౌందర్యం, నా నిరాశల్ని పటాపంచలు చేసింది. ఎంతో లోతైన ఆమె హృదయం, ఆ మోములోని నైర్మల్యం నన్ను ఉత్తేజితుని చేసేవి.

నా ముందు - చెట్లకిందుగా ఆమె మందగమనం చేస్తుంటే, పొడవైన ఆ కురులు ఆమె నడకకు లయగా సోయగాలు పోయేవి.

ఓ నెరిసిన వెంట్రుక నీరెండలో తళుక్కుమనేది! నాలో ఆత్మవిశ్వాసం - దూరాలలో ఉన్న ఆల్ఫ్ పర్వతంలా ఉన్నతంగా అద్భుతంగా అన్పించేది!

(ముఖచిత్రం మరియు 4వ అట్టపై చిత్రాలు చార్లీవి)

# సర్వమతసార సర్వస్వం - సూఫీజం

- డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

సూఫీజం ఒక మతం కాదు. ఒక తెగ కాదు. ఒక సరళ సుసంస్కృత స్థితి. ఒక ఉదాత్త తాత్త్విక చింతన. లౌకిక ఆకర్షణల నుండి భగవత్ శక్తి వైపు మళ్ళించుటకు తోడ్పడే సరళ సుందర తత్త్వమే సూఫీతత్వం.

సూఫీ అంటే పరిశుద్ధాత్ముడు. సూఫీతత్త్వానికి, ఇస్లాంకు సంబంధంలేదు. ఇస్లాం ప్రవర్ధమానదశలో, సూఫీమతం మరింత వ్యాప్తి చెందింది. క్రీ.పూ. రెండవ శతాబ్దంలోనే ఈ చింతనాధార వుండేది. సూఫీ పథంలో మత దురభిమానానికి తగిన విరుగుడున్నది. సామాజిక దృష్టిని పెంపొందించే కథలున్నాయి. సదా సద్వివేకాన్ని పెంచే విజ్ఞానదాయకమైన పాటలున్నాయి. నృత్య సంగీతములున్నాయి.

దేవుని చూడాల్సింది ఆలయాల్లో, మఠాల్లో, మసీదుల్లో, చర్చీలలో కాదు. మన హృదయ మందిరంలోనే. మహోన్నతమైన సందేశముంది. ఇదొక సాత్విక చింత, ఆత్మీయమైన అవలోకన సూఫీజం.

ఒక మారు సూఫీ యోగి హబీబ్ స్నానం చేసేందుకు, ఒక సరస్సులోకి వెళుతూ, తాను ఎల్లప్పుడూ ధరించే ఉన్ని దుప్పటిని గట్టున వుంచి వెళ్ళాడు. కొంతసేపటి తర్వాత మరొక సాధువు, హసన్ అల్‌బస్త్రి, హబీబు దుప్పటిని గమనించి, 'అయ్యో, హబీబ్ మరిచిపోయాడు, ఎవరైనా ఎత్తుకెళితే అతనికి ఇబ్బంది కలుగుతుంది అనుకొన్నాడు. కాపలా కాస్తూ అక్కడే వుండిపోయాడు.

స్నానం ముగించి వచ్చిన హబీబ్, హసన్‌ను చూసి, ఆశ్చర్యంతో అతనిని అభినందించాడు. "నా అదృష్టవశాన, మహాసాధువు దర్శనం లభించింది, కారణం? అని ప్రశ్నించాడు. 'హబీబ్, నీ దుప్పటి రహదారిపై వుంచిపోయావు ఎవరైనా ఎత్తుకుపోతే ఎవరిని విశ్వసించి ఇలా వదలి వెళ్ళావు? అని అడిగాడు హసన్.

హబీబ్ నవ్వుతూ ఎవరిని నమ్మమంటారు. ఈ దుప్పటి కాపలాకు, ఎవరిని నియమించాడో, ఆ భగవంతునిపై నమ్మకంతో వెళ్లాను. హసన్ అతని సమాధానాన్ని విని సంతోషించాడు. ఇది ఒక సూఫీ కథ.

సూఫీయిజం అన్నది ఒక విశ్వాస పరంపర. సాధారణంగా, సూఫీ చింతన, ఒక ముస్లిం వర్గానికి చెందినదనుకొంటారు. ఇది తప్పు కల్పన. అన్ని మతముల సారమే సూఫీ చింతన. ప్రవక్త మహమద్, సూఫీలను ప్రశంసిస్తూ, వారిని గౌరవించమని ఆదేశించాడు.

సూఫీయిజం సంగ్రహ సారూప్యాన్ని, షేక్-ఉల్- ఇస్లాం జకరియా ఈ విధంగా వర్ణించాడు:

"సూఫీజం, వ్యక్తి తన కల్మషాలను కడుగుకొని, పవిత్రుడయ్యే మార్గాన్ని బోధిస్తుంది. బ్రహ్మానంద సిద్ధికి, తన బాహ్యాభ్యంతరాలను, ఎలా నిర్మించుకోవాలో తెలుపుతుంది. ఆత్మ పారిశుద్ధ్యానికి, బ్రహ్మానందానికి దోహదం చేస్తుంది.

'సూఫీ' పదం అరబిక్ భాష 'సఫా' నుండి ఏర్పండిందన్నారు. 'సఫా' అంటే శుద్ధమైనది, పవిత్రమైనది.

---

డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి, ఫౌండర్ సెక్రటరీ, సి.పి.బ్రౌన్ మెమోరియల్ ట్రస్టు లైబ్రరీ, కడప.

10వ శతాబ్దంనాటి, అల్‌బిరూని అభిప్రాయం ప్రకారం సూఫీపదం, 'సోఫియా' అన్న లాటిన్ పదం నుండి ఏర్పడింది. 'సోఫియా' అంటే జ్ఞానం.

'సూఫీ' అంటే కంబళిని ధరించే అలవాటు కలవారు - కాన ఆ పేరు వచ్చిందన్నారు.

**సూఫీల నమ్మకాలు:**

సూఫీల విశ్వాసాలను గమనించిన, అవి భారతీయ వేదాంత తత్వానికి అత్యంత సన్నిహితంగా వున్నట్లు తెలుస్తుంది.

"సత్యం లేదా భగవంతునికి నామరూపాలు లేవు. ఎటువంటి విశేషణములతో వర్ణించుట అసాధ్యం. అతడు సర్వవ్యాపి. ఏ వస్తువూ, అతని స్థాయిరూపం కాదు.

'నేను భగవంతుడు - వేర్వేరు అన్న భావం లేకుండా, తాను మూల సత్యమందలి ఒక కణంగా మారటమే అతని ధ్యేయం.

సూఫీలు అన్ని మతాలను గౌరవిస్తారు. మత కర్తలందరూ వారికి పూజ్యులే. వారి దృష్టిలో బుద్ధుడు బౌద్ధుడు కాదు, ఏసుక్రీస్తు క్రైస్తవుడు కాదు, ప్రవక్త మహమద్ మహమ్మదీయుడు కాడు, వారందరు దివ్య సందేశాన్ని మానవ జాతికి తెలియజేసే దైవదూతలు. నిజమైన సూఫీ అందాభిమానికాదు, అతడు అనుభావి.

**సూఫీల చరిత్ర :**

ఈ పరంపర ఎపుడు ప్రారంభమైనదీ కచ్చితంగా చెప్పలేం. కాని సూఫీ పరంపర క్రీ.పూ. రెండవ శతాబ్దంలోనిదని స్పష్టమైన దాఖలాలున్నాయి. నేటి ఇరాక్‌లోని బస్రా ప్రాంతం, పరిసరాల్లో సూఫీలు ఎక్కువగా వుండేవారు. కాన ఆకాలంలోనే సూఫీమతం ప్రారంభమై వుండవచ్చునన్నారు.

ఇస్లాంమతం వ్యాప్తి చెందిన తర్వాత సూఫీమతం నూతనత్వం సంతరించుకుంది. ఇస్లాం మోసస్‌ను, ఏసుక్రీస్తును, మరికొందరు మతాధిపతులను గౌరవించింది.

ఆ కాలంలో సూఫీలు, అరబ్ రాష్ట్రాలలో తమ తత్వాలను ఆచరణలో పెట్టారు. అప్పుడే ఒక శిష్యుడు (మురద్) ఒక ఆధ్యాత్మిక గురువును అన్వేషిస్తూ (షేక్-పీర్) అతని మార్గదర్శనంలో, హృదయ పరిశుద్ధిని కనుగొని, చెడు ప్రవృత్తుల నిర్మూలన కోసం కొన్ని గురుకులాలను ప్రారంభించాడు.

క్రీ.శ. 1200 నుండి 1500 వరకు సూఫీమతం బాగా వ్యాప్తి చెందింది. ఈ కాలాన్ని వారు స్వర్ణయుగంగా భావించారు. షియావర్గం ప్రబలంగా వున్న బాగ్దాద్ నుండి పర్షియా, పాకిస్తాన్, భారతదేశం, ఉత్తర ఆఫ్రికా, స్పెయిన్ దేశాలకు వ్యాపించింది. ఇలా వ్యాప్తి చెందుతూ ఇతర చింతనలతో కూడి 'యసవీ' అన్న వర్గం ప్రారంభమైంది. దీని స్థాపకుడు నేటి కజికిస్థాన్‌కు చెందిన "ఖ్వాజా అహమద్ యసవీ."

ఆ తర్వాత మధ్య ఆసియా, నజిముద్దీన్ కుబ్రా, పేరుతో కుబ్రావియా వర్గం ఏర్పడింది. ఈ మార్గానికి చెందిన షేక్‌లు వేలాదిమంది గురువులయ్యారు. ఆనాటి ప్రముఖ సూఫీ అబ్దుల్ ఖాదర్ జిలాని. ఇతడు ఇరాక్‌లో "క్వాదరియా" అన్న వర్గాన్ని ప్రారంభించాడు. టర్కీలో, మెవ్‌లెవి, జిలాలుద్దీన్‌రూమి, ఇరాన్‌కు చెందిన షహబుద్దీన్ సుహ్రావర్ది, భారతదేశానికి చెందిన మొయినుద్దీన్ చిష్టీ మరియు మక్దుమ్ అశ్రఫ్‌లు సూఫీ ప్రముఖులు.

సూఫీతత్వం, స్వర్ణయుగంగా పరిణమించిన 12-15 శతాబ్దాలలో ఎందరో గురువులు వెలిగారు. పరిశోధకులు కొందరిని విశిష్ట మార్గదర్శకులుగా పేర్కొన్నారు. వీరు మూడు తరాలకు చెందినవారు. సూఫీలందరూ, ఈ మహాగురువుల ద్వారా 'బరాకా' (ఆధ్యాత్మిక పథం) అందుకొన్నామన్నారు.

మొదటి తరం గురువులు, అబుబక్ర్, ఉమ్మర్ఆలీ, బిలాల్, ఇబ్నరియా, అబుఅబ్దుల్లా మరియు సల్మాన్.

ఆధ్యాత్మిక సాధనలో ప్రధానంగా ఆరు దశలు దాటిన మహనీయులు, 'కుతుబ్'గా ప్రస్తుతులందుకొన్నారు.

*కొందరు ప్రముఖ సాధువులు:*

సూఫీ పరంపరలో ఎందరో సాధకులు, కవులు, సాహితీవేత్తలు, గాయకులు వున్నారు. వారిలో అతివిశిష్టుల సంగ్రహ పరిచయం.

**1. హసన్-అల్-బష్రి :** ఇస్లాం తొలి దశలో సుప్రసిద్ధుడు. గురువులేని శిష్యుడుగా చెప్పుకొనేవాడు. ప్రతి ప్రాణి నుండి సంఘటన నుండి నేను నేర్చుకొన్నాను. దైవ సేవకు అంకితమైన, హసన్ అల్బస్రి క్రీ.శ. 728లో దివంగతుడయ్యాడు.

**2. రబియా :** ఉల్-అదవియా (క్రీ.శ. 801)లో కాలగతి చెందిన సాధ్వి. ఎటువంటి ఫలాపేక్ష లేక భగవంతుని పట్ల, నిష్కల్మష భక్తిగల మహిళ. ఎన్నో మహిమలు చూపారు. ప్రముఖ సూఫీ విద్వాంసుడు, హసన్బసరీ ఒకమారు మహిళాసాధ్వి రబియాను కలుసుకోవాలని వచ్చాడు. ఆమె అపుడు ఒక నదీతీరంపై వుంది. నమాజ్ వేళయింది. హసన్ నదిలో కూర్చుని నమాజ్ ప్రారంభించాడు. రబియాను కూడా ఆహ్వానించాడు.

ఆమె, తన ఆసనాన్ని గాలిలో వేసుకుంది. నేను కింద కూర్చోను గాలిలోనే వుంటూ నమాజ్ చేస్తాను అన్నది రబియా. హసన్బసరీ ఆమెకున్న శక్తి తనకు లేకపోయిందని వాపోయాడు. రబియా అతని బాధను గమనించి "అయ్యా మీరు చేయగల పనిని ఒక చేప చేయగలదు, ఒక పక్షి గాలిలో ఎగురగలదు. ఈ పనులు చేయటం అనవసరం. మనం సామాన్యులను ఉద్ధరించాలి. హసన్కు జ్ఞానోదయమైంది. మహిమలు ప్రదర్శించటం తగదు. ప్రజలను ఆధ్యాత్మిక చింతనకు ప్రేరేపించాలి. అప్పుడు మన జీవితం సార్థకమవుతుంది అన్నది రబియా.

**3. జునైయద్ :** (నిర్వాణం క్రీ.శ. 910) అత్యంత జనప్రియుడైన బోధకుడు. ఇతడు ప్రచారం చేసిన 'ఫనా బఖా' జనప్రియమైనవి. 'ఫనా' అంటే భగవంతుని సన్నిధిలో మైమరచిపోవటం 'బఖా' లౌకిక జీవితంలో నిష్కల్మషంగా వ్యవహరించటం.

**4. షేక్సాది :** (క్రీ.శ. 1184-1291) ఇతడు రచించిన 'గులిస్తాన్' (గులాబితోట), బస్తాన్ (పళ్ళతోట) సూఫీ సాహిత్యంలోని విశిష్టకృతులు.

**5. ఫరీదుద్దీన్ అత్తార్ :** (నిధనం క్రీ.శ. 1220) గొప్ప దార్శనికుడు. ఇతని జీవితం ఎన్నో అద్భుత గాథల మయం. 114 రచనలు చేశాడు. వాటిలో 'పక్షులుసభ', "యాత్రికుని ముందడుగు" ప్రముఖమైనవి. సూఫీతత్వాన్ని విశదపరచే అపూర్వజ్ఞాన భాండారాలు ఆ రచనలు. అత్తార్ ఒక రోజు, తన మందుల దుకాణంలో వుండగా, ఒక సూఫీ సాధువు వచ్చాడు. అతడు కన్నీళ్ళు, కారుస్తున్నాడు. అత్తార్ అతనిని గమనించి, "వెళ్ళిపో, నిల్చోవద్దు" అన్నాడు. వెంటనే ఆ సూఫీ

సాధువు "నేను పోతాను, నేను కప్పుకొన్న దుస్తులు తప్ప, నాకేమీ లేదు" కాని ఎంతో విలువైన మందుల వ్యాపారం చేస్తున్నావు. పోయేముందు వీటిని భద్రపరచే ఏర్పాటు చేయాలి కదా? అన్నాడు. వెంటనే అత్తార్ తలలో ఒక మెరుపు మెరిసింది. దుకాణాన్ని, ఇంటిని వదలి సూఫీ సాధువుగా ధర్మప్రచారానికి పూనుకొన్నాడు. ఫరదుద్దీన్ తన వారసునిగా నిజాముద్దీన్ ఔలియాను నియమించాడు. అతని శిష్యుడే అమీర్‌ఖుసు.

**6.** మౌలానా జలాలుద్దీన్ రూమి : క్రీ.శ. 13వ శతాబ్దంలో జన్మించాడు. క్రీ.శ. 1273లో కన్నుమూశాడు. బ్యాక్ట్రియాలోని ఒక సంపన్న కుటుంబంలో జన్మించాడు. విద్యాధికుడు. ఇతని పర్షియన్ రచనలు కావ్యాత్మకములు. వీటిని 'పర్షియన్ భాషాకురాన్" అనేవారు. అరేబియా, భారత్, పాకిస్తాన్ ముస్లింల దృష్టిలో మానవీతిహాసంలో వెలిగిన గొప్ప అనుభావకవి జలాలుద్దీన్‌రూమి. రూమి రచనల్లో శ్రేష్టమైనది 'మస్నవి' ఆరు సంపుటాల అత్యుత్తమకృతి. వీటిలో వినోదాత్మక కథలు, సంభాషణలు, ప్రాచీన సూఫీల జీవిత విశేషాలు అద్భుతంగా చిత్రింపబడినవి. 'రుహి-మా-ఫిహి' ఇతని మరొక విశిష్ట రచన. ఇది అతని ప్రవచనాల సంకలనం. 'జీవితంలో నీటినే చూడని ఒక మనిషి కళ్ళుకప్పి, నీటిలో వేసినపుడు అతనికి దాని అనుభవం మాత్రం కలుగుతుంది. కంటికి కట్టిన గుడ్డను తీసినపుడు అతనికి దర్శనం కలుగుతుంది. అనుభవ పరిణామమే భగవద్దర్శనం (రూహి-మా-ఫిహి 'నుండి) దివాన్-ఎ-శామ్-ఎ-తాబ్రిబేతాబ్రిచ్‌శామ్ కొత్త రచనలు వాటిల్లో సూఫీ యోగులు కలుసుకొన్నపుడు చర్చలు వివరాలున్నాయి.

రూమి, విశాలహృదయుడు. ఒక కవితలో భగవంతుని అన్వేషిస్తూ ఇలా అన్నాడు: "నేను శిలువను ఆద్యంతం చూశాను, క్రైస్తవులను పరీక్షించాను, ఏసు శిలువపై లేడు. హిందూ దేవాలయానికి, పగోడాకు వెళ్ళాను. అక్కడా అతని చిహ్నాలేవీ లేవు. పర్వతాలు, గుహాలయాల్లో అతనికోసం గాలించాను, కాబాకు వెళ్ళాను, అక్కడాలేడు. చివరకు నా హృదయంలోకి తొంగిచూశాను, అతడు అక్కడే వున్నాడు, మరెక్కడా లేడు" అన్నాడు.

జాతి-మత విద్వేషాగ్నిల్లో కుతకుతలాడుతున్న సమాజానికి, రూమి పలుకులు మార్గదర్శకాలుగా వున్నాయనటం వాస్తవం.

**7.** ఇబ్న్-అల్-అరాబి : అరబిక్ భాషలో ఇతనిని 'సర్వశ్రేష్ఠ గురువు' అంటారు. ఇతడు సుప్రసిద్ధుడైన హాతిమ్‌తాయి వంశానికి చెందినవాడు. 1164లో జన్మించాడు. ప్రతిభావంతుడు "తర్జుమన్-అల్-అశ్వాక్' (కోరికల వ్యాఖ్యాత) ఆ పాటలు ప్రణయగీతాలుగా కన్పించినా, లోతుగా తరచి చూసిన అవి ఆధ్యాత్మిక ఊటలు.

**8.** ఉమర్ ఖయ్యాం : ఉమర్ ఖయ్యామ్ కవితలు ప్రపంచ భాషలన్నింటిలోను అనువదింపబడ్డాయి. ఇతని 'రుబైయ్యాల్' పర్షియన్ భాషలో వుంది. ఇంగ్లీషులోకి అనువదించినవాడు ఎడ్వర్డ్ ఫిట్జ్‌గెరాల్డ్. తెలుగులో దువ్వూరు రామిరెడ్డి 'పానశాల'గా అనువదించారు.

## భారతదేశంలో సూఫీ పథం:

దాదాపు వేయి ఏళ్ల క్రితం హిందూ మరియు సూఫీల మధ్య సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ఆదాన - ప్రదానాలు జరిగాయి.

మొట్టమొదట భారతదేశం తన నివాస భూమిగా నిల్చిన సూఫీ పండితుడు ఉద్‌మాన్ - బిన్ - అలి అల్ హుజ్వారీ - అతడు లాహోర్‌లో వుండేవాడు. 'కషవు - అల్ - మహజాబ్' అను తన్మయీ భావం గురించిన గ్రంథాన్ని పారసీక భాషలో రాశాడు.

భారతీయ సాంస్కృతిక చరిత్ర అన్న గ్రంథకర్త డా. తారాచాద్ ఇలా అన్నారు: "Certain other characterize of south Indian though from the ninth century onward, however, strongly point to Islamic influence. absorption God through devotion to a teacher... the suficonception of the defined teacher was incorporated into medieval Hinduism." తారాచాద్ అభిప్రాయం ఎలా వున్నా వేలాది ఏళ్ళుగా వున్న వేదాంత పరంపరలో గురువు మూలంగా భగవంతుని దర్శించుకోవటం అవసరమని విశ్వసింపబడింది.

మహర్షి దేవేంద్రనాథ్ టాగూర్ (1815-1905) రెండేళ్ళపాటు హిమాలయాల్లో వుండి సూఫీ సాధువు హాఫీజీ కవితలను అధ్యయనం చేసి స్ఫూర్తి పొందినట్లు పేర్కొనబడింది.

చిష్టీ మతానికి చేరిన మోయినార్దీన్ చిష్టీ మోయి పరంపరకు చెందిన భక్తుడు. 17వ శతాబ్దంలో మొగల్ రాజవంశానికి చెందిన దారాషికో వేదసాహిత్యాన్ని ఇస్లాం సాహిత్యంతో పోల్చి అధ్యయనం చేయడమేగాక సూఫీల కవితల్లో వేదాలలోని సామ్యతలను గుర్తించినట్లు చరిత్ర చెబుతున్నది. చిష్టీ సూఫీలు రాజస్థాన్, అజ్మీర్ మొదలైన ప్రాంతాల్లో, దక్షిణ భారతంలో, గుల్బర్గా, బీదర్, బిజాపూర్, హైదరాబాదు ప్రాంతాల్లోను స్థిరపడి ప్రజాదరణ పొందారు.

భారతదేశంలో మరోమారు సూఫీ పథం జనులను అలరిస్తూవుంది. సూఫీ పాటలు, కవ్వాలీలు, జనరంజక మవుతున్నాయి. హిందూ ముస్లిమ్ సమైక్యతకు తోడ్పడ్డారు.

సూఫీ అన్నది ఒక అందమైన అనుభవసారం. ఒక చింతన రూపం. దానిని మతాల చట్రంలో బంధించుటకు వీలులేదు. అది భాషాతీతమైనది. అది హృదయభాష. సమర్పణాత్మకమైనది. 'ఇష్కే-హఖీఖీ' - భగవత్ ప్రేమమయమైనది.

అది జీవితం నుండి పరుగుతీసే పలాయనవాదం కానేకాదు. సూఫీలకు జీవితం ఒక ఉత్సవం. ఒక సంబరం.

రూమి, తన 'మస్నవి' లో రచించిన చిన్న కవితను మననం చేసికొని మన జీవితాన్ని పరిశుద్ధం చేసుకొందాం. ఈ మాట, వ్యక్తికి సమాజానికి కూడా అన్వయిస్తుంది.

"నేను నిర్జీవ వస్తువునై మరణించి
సస్యంగా వచ్చాను.
సస్యంగా నశించి, ప్రాణిగా వచ్చాను
ప్రాణిగా మరణించి, మనిషిగా వచ్చాను.
ఈ మనిషి ఆకారాన్ని వదలుకునేందుకు భయమెందుకు
నేను మనిషిగా మరణించి
దేవతగా లేచి వస్తాను."

(రెండవ అట్టపై కొన్ని సూఫీ చిత్రాలు) ('తరంగ' కన్నడ వారపత్రిక సౌజన్యంతో)

# సామాజిక పరిశోధకులకు ఉండాల్సిన లక్షణాలు!

- సి.వి. సర్వేశ్వర శర్మ

పరిశోధన అంటే ఒక అంశాన్ని తీసుకుని దాని గురించి ఇంతకు ముందు ఎవరైనా చర్చించి ంటే, విశ్లేషించి ఉంటే, వారి భావాలు, మన స్వంత భావాలు, అభిప్రాయాలు కలిపి సిద్ధాంతం యడం కాదు.

కార్యాకారణ సంబంధాల అధ్యయన సముపార్జిత విజ్ఞానమే శాస్త్ర విజ్ఞానం. పరిశోధన అనేది ిశీలన ద్వారా, సంఘటనల, వస్తువుల, కారకాల, మానవుల యొక్క యధార్థమైన సంబంధాన్ని వగాహన చేయడమే. పరిశోధనకు ఒక క్రమం, పద్ధతి, కొన్ని నియమాలు వున్నాయి. ప్రతి ిశోధకుడు వాటిని పాటించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

మనిషి సమాజమనే సముద్రంలో ఈదే చేపలాంటి వాడు. శాస్త్ర పరిశోధన కూడా సముద్రం ంత లోతైనది, సువిశాలమైనది. మానవుడు తన ప్రగతికి కావలసిన స్వేచ్ఛ సమాజం నుండి ాత్రమే పొందగల్గుతాడు.

పరిసరాల ప్రభావం, పరిస్థితులు మానవుడి చైతన్యాన్ని నిర్ణయిస్తాయి. శాస్త్ర పరిశోధనా ఫలితాలు ిశోధకుని యొక్క స్వభావం, అవలక్షణాలు, తీసుకునే నిర్ణయాలు, అవలంబించే పద్ధతులు, భిరుచి, మేధ, వ్యక్తిత్వం, ప్రవర్తనపై ఆధారపడి ఉంటాయి.

సామాజిక శాస్త్ర పరిశోధకుడు స్వాభావికంగా చురుకుదనం గలవాడు, పట్టుదల గలవాడు, నుభవం, శిక్షణ పొందినవాడు మంచి ఫలితాలను ఇవ్వగల్గుతాడు. సామాజిక శాస్త్ర పరిశోధకునికి ండాల్సిన లక్షణాలు ఏమిటో పరిశీలిద్దాం.

- విషయసేకరణ అభిలాష
- సరియైన ఆలోచన
- సహనం, ఆత్మనిగ్రహం, ఆత్మ విశ్వాసం
- పరిశోధనా సామర్థ్యం
- విమర్శానశక్తి, గణాంకసేకరణ చాతుర్యం
- నిష్పాక్షికత
- శిక్షణానుభవం
- కాలవినియోగం
- మంచి వ్యక్తిత్వం.

**విషయసేకరణ :**

విషయసేకరణతోపాటు ప్రతి శాస్త్రవేత్త పరిశోధనలో శాస్త్రీయ విజ్ఞానంకూడా కలిగి ఉండాలి. పరిశోధనాభిరుచి లోపిస్తే పరిశోధన పరిశోధనగానే మిగిలిపోతుంది. పరిశోధనలో శాస్త్రీయ విజ్ఞానం లేకపోతే పరిశోధనా ఫలితం నిరుపయోగం అవుతుంది.

---

సి.వి. సర్వేశ్వర శర్మ, ప్రెసిడెంట్, కోనసీమ సైన్సు పరిషత్, అమలాపురం.

## సరియైన ఆలోచన :

శాస్త్రవేత్త ఆలోచనలు 'యధార్థాన్ని' ప్రతిబింబించేవిగా ఉండాలి. తన ఆలోచనలు ఒక సంస్థకు, ఒక ప్రాంతానికి, ఒక దేశానికి మాత్రమే పరిమితం చేయకూడదు.

సుస్పష్టమైన భావాలు, సరియైన ఆలోచనలు విస్తృత గ్రంథ పఠనం వల్ల, పరిశోధనా కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల, తర్జన భర్జనలవల్ల, అనుభవ పూర్వక పరిశీలనల వల్ల వస్తాయి. శాస్త్రవేత్తకు సాధన సంపత్తిని నిర్వహించే శక్తి, అభిలాష కూడా ఉండాలి.

## సహనం, ఆత్మనిగ్రహం :

పరిశోధన ఎడతెగని శ్రమ, శాంతి, సహనంతో కూడి ఉంటుంది. ప్రతి విషయాన్ని పలుమార్లు పరిశోధించవలసి ఉంటుంది. శాంతి, సహనం లేని పరిశోధన యధార్థానికి దూరంగా ఉంటుంది.

పరిశోధకుడు పరిశోధనలో అంతర్గత, బహిర్గత సమస్యలు ఎదుర్కోవలసి వస్తుంది. వీటికి జవాబు శాస్త్రవేత్త ఆత్మనిగ్రహం, శాంతి, సహనం వల్లనే ఇవ్వవలసి ఉంటుంది. ఆత్మనిగ్రహం వల్ల దురభిప్రాయాన్ని, పక్షపాత వైఖర్ని విస్మరించి నిష్పాక్షిక ధోరణిని అలవరచుకుంటాడు.

## పరిశోధనా సామర్థ్యం :

పరిశోధకుడు సమస్యలను ఉద్రేకపూరితంగా కాకుండా, సామరస్యంగా, చాకచక్యంగా సమీకరించి నిర్వహించగలగాలి. మనిషి ఆలోచనలు అమోఘంగా ఉంటాయి. వాటిని నెరవేర్చడానికి శక్తి - బాహ్యశక్తి - ఆర్థిక శక్తి అవసరం. నిర్వహించే సామర్థ్యం లోపిస్తే ఆలోచనలు, శక్తి ఉండి కూడా నిష్ప్రయోజనం అవుతుంది.

నిర్వహణశక్తి లోపించిన పరిశోధకుడు తనకున్న సహజ సంపత్తిని, వనరులను, సాధనాలను నిరుపయోగంగా తయారు చేస్తాడు. పరిశోధనా సామర్థ్యంతో పాటు తక్షణ నిర్ణయాలు తీసుకోగల నైపుణ్యం పరిశీలకునికి ఎంతో అవసరం.

## విమర్శనాశక్తి :

పరిశోధనా సమయంలో ఏ సమస్య సరియైనది? ఏది కాదు? అని నిరూపించే విమర్శనా జ్ఞానం పరిశీలకునికి కావాలి. సమాచార సేకరణలో ఒక్కొక్కప్పుడు అనవసర సమాచారం లభించడం జరుగుతుంది. సరియైన, యధార్థమైన సమాచారాన్ని సేకరించుకోగల విమర్శనాశక్తి, గణాంక సేకరణ చాతుర్యం పరిశీలకునికి ఉండాలి.

విద్యవల్ల, విజ్ఞానాభిలాష వల్ల విమర్శనాశక్తి సాధ్యమవుతుంది. పరిశోధకునికి దూరదృష్టి అవసరం. అప్పుడే అనువుగాని, క్లిష్టమైన సమాచారం నుండి అనువైన, విలువైన సమాచారాన్ని ఎన్నుకోగల్గుతాడు.

## నిష్పాక్షిత :

సత్యాన్వేషణకు నిష్పాక్షికత ఒక పద్ధతి. ఒక విషయాన్ని అర్థం చేసుకోవడంలోగాని, వివరించడంలోగాని, వస్తుగత పరిశోధనలోగాని, హేతుబద్ధతలోగాని, విశాల దృక్పథంలోగాని, నిజాయితీ

కలిగియుండడంలో గాని, సామాజిక వాస్తవికతను అర్థం చేసుకోవడంలోగాని, వ్యక్తిగత అభిప్రాయాలకు, విలువలకు చోటు ఉండకూడదు.

సామాజిక వాస్తవాలను ఖచ్చితంగా పరిశీలించడం ఎంత అవసరమో, వాటిని యధార్థంగా బహిర్గత పరచడంలోను పరిశోధకుడు నిష్పాక్షికతతో ఉండాలి. నిష్పాక్షికతలో నిజాన్ని, యధార్థాన్ని దాచడం ఉండదు. సామాజిక శాస్త్రవేత్త ఒక విడివ్యక్తిగా కాకుండా ప్రజా జీవితంలో భాగస్వామిగా అందరి ముందుకు రాగలగాలి. అప్పుడు అతడు తన పరిశోధనలో నిజాయితీగా, స్పష్టతతో ముగింపును చేయగల్గుతాడు.

*శిక్షణానుభవం :*

పరిశోధకునికి సరియైన అనుభవం, శిక్షణా ఉండాలి. ఈ రెండూ అతనిని పరిపూర్ణమైన పరిశోధకునిగా తయారు చేస్తాయి. పరిశోధనా కాలం ఆదా అవుతుంది. విషయానుభవం వల్ల అంధకారంలో చేసే ప్రయాణాన్ని వెలుగులోకి, అశ్రద్ధను శ్రద్ధలోకి, అజాగ్రత్తను జాగ్రత్తలోకి, పరిమితమైన విజ్ఞానాన్ని అపరిమితమైన విజ్ఞానంలోకి మార్చగల్గుతుంది.

పరిశోధకుడు తన స్వీయ అనుభవంతో తప్పులు చేసి ఒప్పులు తెలుసుకోవడం వల్ల ఎక్కువ కాలం నష్టపోవలసి వస్తుంది. పరిశోధనలో అనుభవం అనేది శాస్త్రీయంగా, సమర్థమైనదిగా ఉండాలి. దీనికి శిక్షణానుభవం ఎంతో ఉపకరిస్తుంది.

*కాల వినియోగం :*

శాస్త్రవేత్త కాలాన్ని తనదిగా ఉపయోగించుకునే సామర్థ్యం కల్గి ఉండాలి. కాలాన్ని సద్వినియోగం చేసుకోగల్గడం మనిషి ఉత్తమ లక్షణాలలో మొదటిది. పరిశోధకుడు తన కాలాన్ని ఎలా వినియోగించుకుంటున్నది తనే అంచనా వేసుకోవాలి.

పరిశోధకుడు సరియైన కాలాన్ని, స్థలాన్ని, వ్యక్తిని అర్థం చేసుకోగల శక్తి, యుక్తి, సామర్థ్యం కలిగి ఉంటే పరిశీలనను సమర్థవంతంగా నిర్వహించడమేగాక, డబ్బు, మేధా, సహజవనరులు, కాలాన్ని కాపాడిన వాడవుతాడు.

*మంచి వ్యక్తిత్వం :*

పరిశోధనలో మంచి వ్యక్తిత్వం అంటే సరైన ప్రశ్నలు వేయడం, జవాబులు రాబట్టడం అని గుర్తుంచుకోవాలి. సామాజిక శాస్త్ర పరిశోధనలు జరిపేటప్పుడు రకరకాల స్వభావాలు, అభిలాషలు గల వారు, అంతస్థులు, సామర్థ్యాలు గల వారు తారసిల్లుతారు.

శాస్త్రపరిశీలనలో పరిశోధకుని వ్యక్తిత్వం, ప్రవర్తన వ్యక్తిని సంతృప్తి పరచి సరైన సమాచారాన్ని సేకరించి అవి సామాజిక, సాంఘిక, ఆర్థిక పురోభివృద్ధికి తోడ్పడేవిలా ఉండి సామాజికాభివృద్ధికి ఫలితాన్ని పరిశోధకుడు అందించగల్గుతాడు.

ప్రభుత్వం మాత్రమే ఆర్థిక ప్రణాళికలు తయారు చేసి తన యంత్రాంగం ద్వారా అమలుపరుస్తూ పోతూంటే ఆర్థికాభివృద్ధిని, సామాజికాభివృద్ధిని సాధించడం కష్టం. ప్రజల సహకారం, శాస్త్రవేత్తల సహకారం, ముఖ్యంగా సామాజిక శాస్త్రవేత్తల సహకారం ఎంతో అవసరం. అప్పుడే జాతీయ ఆర్థిక లక్ష్యాలను, ప్రణాళికా లక్ష్యాలను సాధించ గల్గుతారు.

# విశ్వనాథ - సౌందర్య మీమాంస

- డా॥ యు.ఎ.నరసింహమూర్తి

*గత సంచిక తరువాయి*

శిల్పమార్గాన్ని అనుసరించని రూపవాదం ఇంకొకటుంది. సాధారణ కవులు ఈ మార్గాన్ని అనుసరిస్తూ ఉంటారు. విశ్వనాథ చాలా అరుదుగా ఇటువంటి రచన చేయడం కనిపిస్తుంది.

దీప్తి మాధుర్యావధి శిరస్సుధాంశు భా
స్వన్మనోహర వివాసమ్ములగుచు
క్లిష్టబంధ విచిత్రకేళీ ప్రశస్తి ర
　　　హః కళా పూర్ణోదయమ్ము లగుచు
కృష్ణ పదాగ్ర భక్తి సుగృహీతా ముక్త
మాల్య దాచ్ఛ ప్రౌఢ మధువు లగుచు
అనితర లభ్య వర్ణాత్త శయ్యాహేతు
వై పాండురంగ మహత్తులగుచుఁ
దీయఁదనములు మెఱుగులుఁ దెచ్చుకొన్న
ప్రియలు ప్రియులు కూడి మనుచరిత్ర లగుచుఁ
దెలుఁగు రసికలోకముల కందిచ్చె నసువు
లత్తుకొని మల్లెపూల్ క్రొత్తక్రొత్త రుచులు. (తెలుగు ఋతువులు - వసంతర్తువు)

తెలుగు పాఠకులు ఈ పద్యాన్ని తల పూవుగా ధరిస్తారు. ఎప్పుడూ స్మరిస్తూనే ఉంటారు. తెలుగు ఋతువులలో ఇలాంటి పద్యం వేరే ఎక్కడా కనబడదు. విశ్వనాథ కవిత్వమంతటిలోను ఇలాంటి పద్యాలను ఎక్కడైనా ఏరి పట్టుకోవాలి గానీ ఎక్కడ పడితే అక్కడ కనబడవు. అదే ఈ పద్యానికి గల గౌరవం. ఇందులో శిల్పం లేదు, కేవలం శ్లేషతో కూడిన చమత్కారం మాత్రమే ఉంది. ఈ శబ్ద చమత్కారాన్ని వదలిపెట్టినప్పుడు కవి ప్రతిభ రాణిస్తుందని విశ్వనాథ భావిస్తారు. అలంకారాల మీద ప్రత్యేకించి శబ్దాలంకారం మీద ఆయనకు వ్యామోహం లేదు. కవిత్వ సాధనలో సాముగరిడీలు చేసే పిల్ల వస్తాదుల అభ్యాసకేళి తప్ప ఇందులో వేరే సౌందర్యమంటూ ఏమీ లేదని విశ్వనాథ భావన. ఈ విధమైన రూపవాదాన్ని ఆయన ఎన్నడూ అంగీకరించలేదు. ఆయన అనుసరించిన శిల్పమార్గం ఆయన కవిత్వాన్ని "సత్పరిచిత సుకుమార వాక్యరళితాభిప్రాయ"గా చేయలేక పోయింది. ఏ విధంగా చూసినా ధ్వని, రస, ప్రస్థానాలలాగా రూపవాదానికి భారతీయ అలంకార శాస్త్రంలో ఆదరణ లభించలేదు. రూపమే సౌందర్యమన్న మాటలు వారంగీకరించలేదు. కేవల రూపానికి ఆత్మావిష్కార సామర్థ్యం లేదు. ఈ విషయాన్నే పురాణం సూరిశాస్త్రి "భావ విహీనమైన రూపసౌందర్యము లేదు, భావ ప్రకట నానుకూల్యత వలన రూప సౌందర్య మేర్పడుచున్నది." అని విశదీకరించారు.[13]

థామస్ ఏక్వినాస్ సౌందర్యాన్ని జ్ఞానేంద్రియ సంబంధమైన వ్యాపారమని అందునా మననశీలమైన శ్రవణ దర్శన వ్యాపార హేతుకంగా భావించాడు. సౌందర్యం మననం వల్లనే ఆనందాన్ని కలిగిస్తుందని చెప్పాడు. సౌందర్య పరకాష్ఠకు సమగ్రత, సమవిభక్తత, స్పష్టత అనే మూడు అవసరాలను గుర్తించాడు.

---

డా॥ యు.ఎ. నరసింహమూర్తి మహారాజా కళాశాలలో తెలుగు శాఖాధ్యక్షునిగా
పదవీ విరమణ చేశారు, విజయనగరం.

సమగ్రత అంటే అంగాంగీభావ సామరస్యము అని అర్థము.[14] సమన్వితత్వము, సంగతత్వము, సమ్మతి అనేవి సౌందర్య సంబంధమైన ప్రాథమికాంశాలు. వాల్మీకి శ్రీరాముణ్ణి గూర్చి "సమహ సమ విభక్తాంగః" అని వర్ణిస్తాడు. అది సౌందర్యానికి తొలిమెట్టు.

"అంగ ప్రతంగకానాంయః సన్నివేశో యథోచితమ్
సుశ్లిష్టః సంధిబంధః స్యాత్తత్ సౌందర్య ముదాహృతమ్."

అనే సందర్భంలో 'సుశ్లిష్టము' అనే మాట పరిగణించదగినది. శ్లిష్టమంటే సంగతమని అర్థం. పూర్వాపర సమన్వయంతో కూడినదని దీని కర్థము. పాశ్చాత్యులు ఈ సంగతత్వానికి జ్ఞాపకాలతో (Associations) కూడి ఉండడమని సౌందర్యపరమైన ఒక సంసర్గ సిద్ధాంతాన్ని లేవదీసారు. వివిధ కళారూపాల ఉదాత్త కళాసౌందర్యం గాని, సౌందర్యం గాని, అవి వ్యక్తం చేసే లక్షణాలు లేదా వాటికి గల సంసర్గం వల్లనే ఉత్పన్నమౌతాయి అని ఎలిసన్ వివరించాడు. ఈ ఉత్పన్నం కావడం కళావస్తువులో గల సంసర్గం వల్లనే సాధ్యమవుతుంది గానీ రూపం వల్ల కాదు. సమవిభక్తతలో సౌందర్యం తనంత తాను నెలకొని ఉండదు. సమవిభక్తత సంప్రదాయంతో, ఆచారంతో ముడిపడి ఉండడం చేత తదనుగుణమైన భావసం సర్గం వల్లనే అది సాధ్యమౌతుంది. అన్న ఎలిసన్ సిద్ధాంతాన్ని మెకంబీ, జాఫ్రీ వంటివారు ప్రాచుర్యంలోకి తెచ్చారు. సంసర్గం (Associations) తార్కికం (rational), హఠాజ్జనితం (accidental) అని రెండు రకాలుగా రస్కిన్ భావించాడు. హఠాజ్జనితాలైన సంసర్గాలకు అతడు ప్రాధాన్యమిచ్చాడు. భౌతిక వస్తు సముదాయానికి సంబంధించిన భావాలకు, జ్ఞాపకాలకు మధ్య ఏర్పడే హఠాజ్జనితమైన సంబంధం వల్ల ఆ భౌతిక వస్తు సముదాయం సుందరంగా గానీ, వికారంగా గానీ కనిపిస్తుంది. ఇలా చెప్తూనే ఈ సంసర్గలు సౌందర్య సృష్టిని చేయవని అన్నాడు. రస్కిన్ సంసర్గకు గల ప్రాధాన్యాన్ని అంగీకరిస్తూనే సౌందర్యమూ, సంసర్గమూ మౌలికంగా దేనికదే స్వతంత్రమైనవని అన్నాడు. అనుభవజ్ఞాన మూలకంగా ప్రాపంచిక వస్తువులపై మనకు ఏర్పడే రాగవిరాగాల వల్ల మనకు అనుభూతులు కలుగుతాయి. ఆ అనుభూతుల సంసర్గం వల్ల తీవ్రమైన ఆనంద విషాద అనుభూతులకు లోనైనప్పుడు ప్రాపంచిక వస్తుజాలానికి ఒక చైతన్యాన్ని ఆపాదించి తత్సంబంధమైన రూపాన్ని కనిపించేలా చేస్తాము.[15]

ఈ సంసర్గం భారతీయుల విషయంలో రెండు రకాలుగా ఉంటుంది. (1) జన్మ సంబంధమైనది (2) జన్మాంతర సంక్రమితమైనది. సంప్రదాయవాదులు జన్మాంతర సంక్రమితమైన సంసర్గాన్ని సంస్కారమని అంటారు. సౌందర్యాన్ని సృష్టించాలన్నా, భావించాలన్నా, అనుభవించాలన్నా ఈ సంస్కారం అవసరమని భారతీయులు విశ్వసిస్తారు. అవిచ్ఛిన్న సంప్రదాయార్థియైన విశ్వనాథ "నా మనసు పారిన వైఖరి దాని పూర్వ సంస్కరణ ఫలంబు" అని స్పష్టంగా తెలియజేసారు. "కృతయుగమతి" అయిన విశ్వనాథ తలపులన్నీ కేవల ప్రాగ్జన్మ సంస్కారంతో నిండినవి మాత్రమే కావు; భారతీయ విజ్ఞానము, సంస్కృతి, చరిత్ర, కళలు, గాథలు - ఈ అన్నింటితో సంసర్గం కలవి.

ఒక దిగుల్ లోనుండి పుట్టి వదలక యుండగా వలయు
నొక తగుల్ నీవన్నఁ గలిగి వెట్టిగా నూగాడవలయు
నకట తానది కోటి జన్మముల చారితార్థ్యమ్ము సంవి
ద కలంక నందమూర్నిలయ! విశ్వేశ్వరా! కులస్వామి! (కులస్వామి శతకం, పద్యం:4)

విశ్వనాథ ఇక్కడ పేర్కొన్న దిగులుకు, తగులుకు సంసర్గమే కారణము. మనసు నుండి ఆత్మ దాకా ప్రయాణం చేసే భక్తుడికి ఈ దిగులు, తగులు ఉంటాయి. కోటి జన్మల నుండి అనుసరిస్తూ

వస్తూన్న సంసర్గ ఫలితంగానే భగవంతుని మీద మనస్సు లగ్నం కాగలదని కవి ఇక్కడ చెప్తున్నారు. ప్రజ్ఞకు మూలం కూడా సంసర్గమేననీ విశ్వనాథ భావించినట్లు తెలుస్తుంది.

శ్రీ శాతమైన నీ వేణు గానంబు రేకగా జ్ఞాన
కోశంబు లోపల వచ్చి చొరనీవె గోపాలబాల!
హ్రీశీర్ణమైన నా గుండె సందులకెక్కి ప్రజ్ఞాని
వేశన! నందమూర్నిలయ! సంతాన వేణుగోపాల! (నందమూరు శతకకము, పద్యం:22)

వేణుగోపాలుని మురళీగానమే ఇక్కడ కవి ప్రజ్ఞకు మూలమైన సంసర్గంగా మనం భావించాలి.

"బహుళ జన్మాత్త సంస్కార భద్రమైన
ఒక వెలుగు నాదు గుండెలో నొదిగియుండె"

అని ప్రకటించిన విశ్వనాథ సౌందర్యమనే ఆ వెలుగును తన రచనలన్నింటిలోను నింపారు. (గిరికుమారుని ప్రేమగీతాలు) వేంగీక్షేత్ర సందర్శనంలో 'అస్మదజ్ఞాత పూర్వ దివ్యత్వ మొప్పు నీ పునీతావనీ ఖండము" అని, కొండవీటి పొగ మబ్బులులో "నా ప్రాణములకును నీ పొగమబ్బులకేమి సంబంధమో" అని పరవశించిపోయిన విశ్వనాథకు, పూర్వాంధ్ర చరిత్రకు గల సంసర్గమే అపూర్వ సౌందర్య సృష్టికి కారకమయింది. పూర్వజన్మ సంస్కార వశాన కలిగిన సంసర్గంతో పాటు జన్మ సంబంధమైన సంసర్గం కూడా విశ్వనాథ రచనలలో పడుగు - పేకలా కలగలసి ఒక రయణీయతను సమకూర్చింది. కవిత్వం రాసేటప్పుడు "నన్నయ్యయు, తిక్కన్నయు నన్నావేశించిరి" అంటారాయన. ఆయన గురు స్థానాలుగా ఎంచుకొన్న పదిమంది ప్రాచీనాంధ్ర కవులు, వారి కవిత్వంతో గల సంసర్గము విశ్వనాథ కవిత్వానికి సౌందర్య నిధులను సమకూర్చాయి. ఇంతకు ముందు ఉదాహరించిన "దీప్తి మాధుర్యావధి శిరస్సుధాంశు భాస్వన్మనోహర విలాసమ్ములగుచు" అనే పద్యం చదవగానే తెలుగు పాఠకులు పరవశించి పోవడానికి సంసర్గమే కారణం. ముందుగా వాళ్లకు ఆ పద్యం చదవగానే హరవిలాసము, కళాపూర్ణోదయము, ఆముక్తమాల్యద, పాండురంగ మహాత్మ్యము, మనుచరిత్ర అనే ప్రాచీన ప్రబంధాలతో గల సంసర్గం స్ఫురిస్తుంది. ఆ సంసర్గమే ఈ పద్యానికి సౌందర్య కారకమయింది. అంతకు మించి వేరుగా ఇందులో సౌందర్యమంటూ లేదు. తెలుగులో అన్ని వర్గాల ప్రజలు విశ్వనాథ తెలుగు ఋతువులను, కిన్నెరసాని పాటలను శిరోధార్యాలుగా భావిస్తారు. గ్రామీణ సంస్కృతి పూర్తిగా అంతరించిపోని కాలంలో వచ్చిన రచనలవి. కవికి, పాఠకులకు గ్రామీణ సంస్కృతితోను, జానపద కవిత్వ లక్షణముతోను కల ప్రగాఢ సంసర్గమే ఆకృతులలో అతిశయిత సౌందర్యంగా స్ఫురిస్తూ ఉంటుంది. "పల్లెల శోభ తెలియని వారికి నాకావ్య సంపద అర్థం కాదు." అని విశ్వనాథ అనడంలోని రహస్యమిదే.

ఒక జానపద గీతం, ఒక ఉదాత్త భావగీతం, ఒక లఘుకావ్యం, ఒక మహాకావ్యం అందించే సౌందర్యం ఒకటేనా? అందులో తరతమ భేదం ఉంటుందా? అనే మీమాంస ఒకటుంది. కళాదర్శనానికి, సాధారణ దర్శనానికి భేదం ఉంది. అది దర్శన తీవ్రతకు సంబంధించినది కాదు. ఎంత స్వచ్ఛ సులభ సుందరమైనదైనా సాధారణ జానపద ప్రేమగీతంలో ఉండే సౌందర్యం ఉదాత్త భావగర్భితమైన సుందర భావగీత సౌందర్యం కంటే మిక్కిలి పరిమితమైనదే. ఈ భేదం కళాతత్వానికి సంబంధించింది కాదు. పరిమాణానికి సంబంధించినది. అలాగే ఒక భావగీతం కంటే ఖండకావ్యం,

ఖండకావ్యం కంటే మహాకావ్యం ప్రగాఢ సౌందర్య స్ఫోరకాలుగా ఉంటాయని కళావిదులంటారు. విశ్వనాథ ఆ కోవకు చెందినవారు. కళాసంబంధమైన అభివ్యక్తి దర్శనానికి గల పరిమితులు ఆచరణాత్మకాలుగా ఉంటాయి. అవి నిర్వచనానికి లొంగవు.

కన్నె కాటుక కళ్ళు - చిన్నినాథుని చూచి
కదలులాడిన వేళ - కందళించిన వేళ
ఆకాశ మధ్యాన అటనొక తెలిమబ్బు
మెరపులా మెరిసిందిలే - వెలుగులో వొరిసిందిలే. (చిన్ని మబ్బులు)

ఆధునికతావాదులు విశ్వనాథ రామాయణ కల్పవృక్షంలో కంటే ఇందులో సర్వజన గ్రాహ్యామైన సౌందర్యపు విలువ ఉందని ఆ కారణంగా రామాయణ కల్పవృక్షం కంటే ఈ కోవకు చెందిన విశ్వనాథ రచనలే విలువైనవని, అందమైనవని, ఆదరణీయమైనవని భావిస్తారు. విశ్వనాథ ఇందుకు అంగీకరించరు. రామాయణ కల్పవృక్షంలో "సద్యో నిర్గతమైన సర్వకవితా సంభారం" ఉన్నదని, అది తన సకలోహ వైభవ సనాథమని భావిస్తారు.

ఒక మహాకావ్యాన్ని దాని ఐక్యాన్ని నిలుపుకోవడానికి అంటే పరిపూర్ణమైన అనుభూతినీ, ఆమోదాన్నీ పొందడానికి ఏకబిగిని చదివినా మనకు కలిగే రసోద్రేకమూ, నీరసస్థితీ కలగలసి ఒడిదుడుకులైన అనుభూతే మిగులుతుంది. ఏ కారణం చేనైనా ఏ కాలంలోనైనా ఒక మహాకావ్యం సర్వజన సమ్మతమైతే అయి ఉండవచ్చు గానీ ఇప్పుడు మళ్లీ ఏ మహాకావ్యమూ తిరిగి అటువంటి సమ్మతి పొందలేదనేది స్పష్టమైంది. ఒక కావ్యానికి గల విస్తృతి ఆ కావ్యానికి గల ఉత్కృష్టతకి ప్రమాణమయితే అంతకన్నా అసంగతం మరోటి ఉండదు. కావ్యానికి గల పరిమాణమూ బరువూ కావ్యగుణాన్ని తెల్పేవి కావు. చెమటోడ్చి కావ్యం రాయడమే ప్రశంసార్హమైతే చెమటోడ్చినందుకు మాత్రమే ప్రశంసించాలి. కావ్యాన్ని మాత్రం ప్రశంసించకండి. ఒక విషయాన్ని అంటిపెట్టుకు ఉండడం వేరు, ప్రతిభ వేరు. మహాకావ్య రచన మాత్రమే గుణాత్మకమైనదని, నిడివిని వదులుకోలేమని కొన్నాళ్ల క్రిందటి వరకు భావించినా ఆ భావం అసంబద్ధమైనది కావడం చేత క్రమంగా అంతరించిపోతోంది. అని ఆధునికులలో కొందరు భావిస్తున్నారు.[16] విశ్వనాథ ఆలోచన ఇందుకు భిన్నమైనది. "రచన రెండు విధాలైనది. మొదటిది కావ్యకథా నిర్వహణ సంబంధి. రెండవది రసభావానుకూల గద్యపద్య రచనా సంబంధి. వృత్త సమూహములతో గూడిన ఏభాషా సారస్వతములలోనైన మొదటి దానికెంత ప్రాముఖ్యముండునో రెండవ దానికంత ప్రాముఖ్యముండును. అందుచేత సంస్కృతి భాష యందు, దాని వలె వృత్త బాహుళ్యము గలిగిన కొన్ని దేశభాషలందు ఈ రెండు విధములైన రచనాశక్తులు కవియందు మహోత్కృష్ట దశను పొందిన గానీ అసలు కావ్యమునకు నిజమైన గొప్పదనము గలుగదు."[17] అంటూ విశ్వనాథ తన మహాకావ్య రచనా మార్గాన్ని సమర్థించుకొన్నారు.

ఇక మిగిలినది సౌందర్యము లక్షణమా? ఫలితమా? అన్న మీమాంస కళా సౌందర్యాన్ని పునః పునరనుసంధానం చేసుకోవడం వల్ల మనకు స్వచ్ఛమయినదీ, శిఖరాయమానమైనదీ, ప్రగాఢమైనదీ అయిన ఆనందం కలుగుతుంది. కవితారసంగా మనం గుర్తించే మానసికానందపు ఉన్నతి లేదా బ్రహ్మానంద సహోదర స్థితి ఈ సౌందర్య చర్వణం వల్లే కలుగుతుంది. సౌందర్యం అనే పదంలోనే ఉదాత్తత ఇమిడి ఉంది. సౌందర్యం కవిత్వావరణం.[18] కానీ ఈ సౌందర్యం ఎక్కడుందంటే

అనుభవంలోనే ఉంది. సౌందర్యం ఫలితమే గానీ ఒక లక్షణం కాదు. అది చర్వణం వల్ల మాత్రమే అనుభూతమౌతుంది. ఈ బ్రహ్మానంద సహోదర స్థితికి చేరుకోవడమే దాని ఫలితం అనిపో అన్నాడు.[19] సౌందర్య మలంకారః అన్న వామనుని నుండి విశ్వనాథ వరకు సౌందర్యాన్ని ఒక ఫలితంగానే భావించారు. లక్షణమని ఎంచలేదు. బ్రహ్మానంద సహోదర తుల్యమైన రసానందాన్ని కలిగించడమే కావ్య సౌందర్యానికి ఫలితం. దీనినే "సద్యః పర నిర్వృతి" అన్నారు. సౌందర్యం ఒక ఫలితం కాబట్టి అనుభవాన్ని అందిస్తుంది.

అధస్సూచికలు


1) విశ్వనాథ మనోసంచారం, విశ్వనాథ అసంకల్పిత సాహిత్యం - 2, ఉపన్యాసాలు - ఇంటర్వ్యూలు, పుట : 225.
2) Kant's Regulative Principle of Aesthetic Excellence : The Ideal Aesthetic Experience - By Robvan Gerwen, The Aesthetic Recipient
3) William K.Wimsatt, Jr. & Cleanth Brooks, Literary criticism - A Short History, 1957, P:481
4) John Ruskin, The Victorian Web, downloaded from Net, P:36 to 40
5) George Santayana, The sence of Beauty, Contrast between Morel and Aesthetic Vailues, PP:27,28
6) K.D.Sethna, "Overhead Poetry, 1972, P:21
7) విమర్శిని - పరిశోధన పత్రిక, 1977, ముందుమాట
8) ముదిగొండ వీరభద్రయ్య, విశ్వనాథ సాహిత్య తత్త్వ వివేచన, 16th July 2000, P:4
9) Impact of gestalt Aesthetics, Psychology on formalism, Aesthetics, Encyclopaedia Britanica, P:17
10) Gswald Hanfling, Aesthetic Quelities, Publisher Blackwell, 1992, P:57
11) Ibid, PP:57 to 62
12) కోవెల సంపత్కుమారాచార్య, 'యుద్ధ' శిల్పావతారిక, కల్పవృక్షము, విశ్వనాథ సాహిత్య సౌందర్య దర్శనము, పద్యం:50.
13) పురాణం సూరిశాస్త్రి, విమర్శక పారిజాతము, కళారహస్యము, పుట:25.
14) Aestheties, Eneyclopaedia Britanica, P:20
15) John Puskin, The Victorian Web, downloaded from Net
16) Kirk Pillow, Aesthetic Reflection in kant and Hegel subline understanding, The MIT Press 2000, 8. The Mel Pholical Subline.
17) విశ్వనాథ, నా గొప్పరచన, విమర్శిని - పరిశోధన పత్రిక, 1977, పుట:5
18) Edgan Allen Poe, The Poetic Principle, Qu : Art for Art's sake, Literary criticism - A Short History, William K.Wimsatt, Jr. & Cleanth Brooks
19) Poe, Philosorhy of composition, I bid.


(సమాప్తం)

# నొబెల్ పురస్కారం గెలవనందుకు

## నొబెల్ ఉపన్యాసం డిసెంబరు 7, 2007

మూలం : డోరిస్ లెసింగ్ అనువాదం : సుమనస్పతి రెడ్డి

గత సంచిక తరువాయి

మాటలను పైకి పలుకుతూ మెల్లగా చదువుతోంది ఆమె. కష్టమైన పుస్తకంలా ఉంది. కాళ్లను అదిమి పట్టేసుకుంటున్న ఇద్దరు చిన్నపిల్లలున్నారు ఆ యువతికి. పైగా మళ్లీ గర్భంతో ఉంది. భారతీయుడు చాలా బాధపడిపోతున్నాడు. ఎందుకంటే ఆ యువతి తలకు కట్టుకున్న తెల్లగా ఉండాల్సిన రుమాలు దుమ్ముతో పసుపుపచ్చగా అయిపోయింది. ఆమె స్తనాల మధ్య, చేతులపైనా అంతా దుమ్మే.

బయట వరుసల్లో నిలబడిఉన్న జనం అంతా దాహంతో అలమటిస్తున్నారు, కాని వాళ్లందరికీ సరిపడే నీరు తనదగ్గర లేదని భారతీయుడు చిరాకు పడిపోతున్నాడు. ఆ ధూళి మబ్బుల అవతల ఆకలిదప్పులతో జనం మరణిస్తూ ఉన్నారన్న సంగతి అతనికి తెలుసు. అందువల్ల చాలా ఆగ్రహంగా ఉన్నాడు. ఈ వ్యవహారమంతా చూసుకునే అతని పెద్దన్న, కరువు దెబ్బకు ఆరోగ్యం చెడిపోయి, విశ్రాంతికోసం దగ్గరే ఉన్న టౌనుకు వెళ్లిపోయాడు.

ఈ మనిషికి అన్నీ తెలుసుకోవాలని ఆసక్తి. యువతిని అడిగాడు: "ఏం చదువుతున్నావు?

"ఇది రష్యా గురించి'', అంది అమ్మాయి.

"రష్యా ఎక్కడుందో నీకు తెలుసా?'' అతనికి కూడా తెలియదు నిజానికి.

యువతి మంద గంభీరంగా, సూటిగా అతని వైపు చూసింది. దుమ్ముతో ఆమె కళ్లు ఎర్రగా ఉన్నాయి. "నేను తరగతిలో అందరి కన్నా బాగా చదివే దాన్ని. నేను అందరికన్నా మేలు అనేవాడు మా టీచర్.''

మళ్లీ చదవడం ప్రారంభించిందా యువతి. పారాగ్రాఫ్ చివరి దాకా చదివేయాలని ఆమె కాంక్ష.

ఆమె ఇద్దరు చిన్న పిల్లల్ని ఒకసారి చూసి వాళ్లకు ఫాంటా ఇవ్వబోతాడు అతను. "ఫాంటా దాహం పెంచుతుంది, వద్దు,'' అంది ఆమె.

ఇది చేయకూడదని తెల్సినా, పక్కన ఉన్న పెద్ద ప్లాస్టిక్ నీటి డబ్బాను కౌంటర్ వెనక్కు ఎత్తేసి, రెండు ప్లాస్టిక్ గ్లాసుల నిండా నీరు పోసి ఆ పిల్లలకు ఇస్తాడు అతను. పిల్లలు నీరు తాగుతూ ఉంటే చూస్తూ ఆమె పెదవులు చప్పరించడం చూస్తాడు అతను. ఆమెకు కూడా ఓ గ్లాసు నీరు ఇస్తాడు. ఆమె నీరు తాగడం చూసి అతనికి బాధ కలుగుతుంది. అంతగా దప్పిక గొని ఉంది ఆమె!

ఇప్పుడు ఆమె అతనికి ఓ ప్లాస్టిక్ నీటి డబ్బా అందిస్తుంది. అతను దాన్ని నింపుతాడు.

ఆ యువతి, ఆ పిల్లలు ఒక్క చుక్క కూడా కింద పడేయకుండా తదేకంగా గమనిస్తారు అతణ్ణి.

ఆమె మళ్లీ పుస్తకం మీదకు వంగుతుంది. చాలా మెల్లగా చదువుతోంది. కాని ఆ పారా ఆమెను హత్తుకుంటుంది. మళ్లీ చదువుతుంది దాన్ని ఆమె.

---

సుమనస్పతిరెడ్డి, ఆకాశవాణి హైదరాబాదులో కార్యక్రమ నిర్వహణాధికారి

"నల్లని జుట్టు మీది నుండి తెల్లని రుమాలు చుట్టుకొని, చుట్టూ పిల్లలను వేసుకొని, వాళ్లతో హాయిగా, వినోదంగా ఆడుతూ - దానితో పాటు, తను ఎంతో ఇష్టపడే మగవాడి నుండి పెళ్లి ప్రస్తావన వచ్చే అవకాశం ఉందనే ఉత్సాహపు పులకింతతో ముగ్ధ మనోహరంగా కనిపిస్తోంది వరెంకా. ఆమె పక్కన నడుస్తూ, ఆమెను అభిమానంగా చూస్తూ ఉన్నాడు అతను. ఆమెను చూస్తూ, ఆమె పెదవుల నుండి విన్న సరదా సంగతులన్నీ, ఆమెగురించి తానెరిగిన మంచి విషయాలన్నీ గుర్తుకు చేసుకున్నాడు.

ఆమె పట్ల తనలో ప్రసరిస్తున్న భావన చాలా అరుదైనదని, ఎప్పుడో తొలి యౌవనంలో, చాలా చాలా కాలం క్రితం ఒక్కసారి మాత్రం అనుభవించిందని, అతనికి క్రమ క్రమంగా అర్థమై పోసాగింది. ఆమెకు దగ్గరగా ఉన్నానన్న ఆనందం నడిచే అడుగడుక్కీ పెరిగి చివరికి అతను ఆమె బుట్టలో సన్నటి కాండంపై, పైకి అలలాగా లేచిన పెద్ద కొండరావి పుట్ట గొడుగును పెడుతూ, ఆమె కళ్లల్లోకి చూసి, ఆమె ముఖంపైకి ఎర్రగా ఉబికి వచ్చిన హర్షాతిరేకాన్ని, భయాందోళనను గమనించి, తనూ ఆందోళనకు గురై, నిశ్శబ్దంగా ఆమె వైపు చూసి మందహాసం చేశాడు. ఎంత అర్థం ఉందో ఆ నవ్వులో!"

అచ్చయిన ఈ ముక్క బికినీలు వేసుకున్న అమ్మాయిల బొమ్మలున్న కొన్ని పాత పత్రికలు, వార్తా పత్రికల కాగితాలతో కలిసి కౌంటర్ మీద పడి ఉంది.

భారతీయ దుకాణపు ఆశ్రయాన్ని విడిచి నాలుగు మైళ్ల దూరంలో ఉన్న ఊరికి వెళ్ళే సమయం ఆసన్నమైంది ఆమెకు. బయట వరుసల్లో వేచి ఉన్న ఆడవాళ్లు అరుస్తూ, ఫిర్యాదులు చేయడం మొదలుపెట్టారు. అయినా భారతీయుడు ఇంకా అక్కడే ఉన్నాడు. వాటేసుకుంటున్న ఆ ఇద్దరు పిల్లలతో ఇంటికి తిరిగి వెళ్లడం ఆమెకు ఎంత శ్రమో అతనికి తెలుసు. ఆమెను అంతగా ఆకట్టుకున్న ఆ వచనపు ముక్కను ఆమెకు ఇచ్చేస్తాడు అతను. కాని పెద్ద పొట్టతో ఉన్న ఈ చిన్న పిల్ల దాన్ని నిజంగా అర్థం చేసుకోగలదని అతను నమ్మలేకపోతున్నాడు.

ఈ మారుమూల భారతీయుడి కొట్లో కౌంటర్ పై "అన్నా కరెనీనా" నవలలో మూడవ వంతు మాత్రం ఎలా వెలిసింది? అంటే ఇలా జరిగింది.

ఐక్యరాజ్య సమితిలో పనిచేసే ఓ పెద్ద అధికారి ఎన్నో సముద్రాలు దాటుకుంటూ చేయాల్సిన పెద్ద ప్రయాణానికి బయల్దేరుతున్నప్పుడు ఈ నవలను ఓ పుస్తకాల దుకాణంలో కొనుక్కొన్నాడు. విమానంలో తన బిజినెస్ క్లాస్ సీట్‌లో కూర్చొని నవలను మూడు భాగాలుగా చింపేసాడు అతను. ఇది చేస్తూ చుట్టూ ఉన్న ప్రయాణీకుల వైపు చూస్తాడతను - అచ్చెరువు, ఆశ్చర్యం వ్యక్తపరిచేవి, కొన్ని హాస్య దృక్కులూ కనిపిస్తాయని తెలుసు అతనికి. సీట్లో చక్కగా కూర్చొని, సీట్ బెల్టును గట్టిగా కట్టేసుకొని, అందరూ వినే లాగా గట్టిగా ఇలా అన్నాడతను: "నేను పెద్ద ప్రయాణానికి బయల్దేరినప్పుడల్లా ఇలాగే చేస్తాను. బరువైన గొప్ప పుస్తకాన్ని పైకెత్తి చదవాలని ఎవరికీ ఉండదు కదా?" అది నిజానికి పేపర్ బ్యాక్ నవల, అయితే సుదీర్ఘమైన పుస్తకమే మరి. తను మాట్లాడినప్పుడల్లా జనమంతా వింటూ ఉండడం ఈయన గారికి అలవాటే! "నేను ప్రయాణం చేసి నప్పుడల్లా ఇలాగే చేస్తాను" అని ప్రకటిస్తాడు. "ఇన్ని రోజుల పాటు ప్రయాణం చేయడం కష్టమైన పని మరి!" నిలబడ్డ వాళ్లంతా మళ్లీ తమ సీట్లల్లో సర్దుకుంటూ ఉంటే, అతను 'అన్నా కరెనీనా' మొదటి భాగాన్ని తెరిచి చదివేవాడు. జనం అతని వైపు చూసినప్పుడల్లా వాళ్లకు చెప్పుకునే వాడు "ప్రయాణం చేసే ఒకే ఒక్క పద్ధతి ఇదే నిజానికి"!

అతనికి ఆ నవల సొంతం తెలుసు, ఇష్టం కూడా. బాగా పరిచయమున్న పుస్తకాన్ని ఇలా సరికొత్త తరహాలో చదవడం దాన్ని మరింత రంజుగా చేసేది.

పుస్తకంలో ఒక భాగం చివరికి వచ్చేశాక, ఎయిర్ హోస్టెస్‌ను పిలిచి దాన్ని కింది తరగతి సీట్లో కూర్చున్న తన సెక్రటరీకి పంపించేసే వాడు. బాగా ముడతలు పడ్డా ఇంకా చదవడానికి వీలుగా ఉన్న ఒక గొప్ప రష్యన్ నవలలోని ఒక్కొక్క భాగం ఇలా విమానం వెనక్కు వచ్చినప్పుడల్లా ప్రయాణీకుల్లో చాలా ఆసక్తిని, కొందరిలో తిరస్కార భావాన్ని రేకెత్తించేది. మొత్తం మీద అన్నా కరెనీనాను చదివే ఈ తెలివైన తీరు అందరి మీదా మరిచి పోలేని ముద్ర వేసేది.

భారతీయుడి కొట్టుకి ఆ రష్యన్ నవలా భాగం అసలు ఎలా చేరిందని మీరు అడగవచ్చును.

అందమైన కథ అవుతుంది. ఎవరైనా చెప్తారేమో దాన్ని.

ఈ లోగా భారతీయుడి కొట్లో, ఆమె పిల్లలు ఆమె స్కర్ట్ అంచులకు వేల్లాడుతుంటే ఆమేమో కౌంటర్‌ను పట్టుకొని ఉంది. తను ఆధునిక స్త్రీ కాబట్టి జీన్స్ వేసుకుంది. కాని వాటి పైనుండి తమ సంప్రదాయశైలి మందపాటి స్కర్ట్ వేసుకుంది. దాని మందమైన మడతలను పట్టుకొని వేల్లాడటం పిల్లలకు సులువు.

భారతీయుడి వైపు ఓ కృతజ్ఞత నిండిన చూపు చూసింది ఆమె. తనంటే అతనికి ఇష్టం అని, జాలి అని ఆమెకు తెలుసు. తర్వాత వీస్తున్న ధూళి మబ్బుల్లోకి నడిచింది.

పిల్లలు అప్పటికే ఏడ్చే స్థాయిని దాటేశారు. వాళ్ల గొంతుకలు దుమ్ముతో అప్పటికే నిండి ఉన్నాయి.

ఇది కష్టం, నిజంగా కష్టం, ఈ అడుగులు వేయడం - భ్రమింపజేసే మెత్తటి కుప్పల్లా పరుచుకొని ఉన్న ధూళి నిండిన మైదానంపైన కాలుతీసి, కాలు వేయడం! కష్టం, కష్టం - కాని కష్టం ఆమెకు అలవాటే, కాదూ! ఆమె మనసంతా అప్పుడే చదివిన కథ మీద లగ్నమై ఉంది. ఆమె ఆలోచిస్తోంది "అచ్చం నా లాంటిదే తను. తెల్లటి రుమాలు తలకు కట్టుకొని, పిల్లల్ని కూడా నాలాగే చూసుకుంటూ. నేను ఆ రష్యన్ అమ్మాయిని కావచ్చు. ఇక ఆ మగవాడు, తనని ప్రేమిస్తున్నాడు అతను, తనని పెళ్లి చేసుకోమని అడుగుతాడు. (ఇంతకీ ఈమె ఒక పారాగ్రాఫ్ దాటి చదవనే లేదు). అవును, నా కోసం కూడా ఒక మగవాడు వస్తాడు, ఈ కష్టాల నుండి నన్నూ, నా పిల్లలను బయటికి తీసుకెళ్తాడు; అవును, నన్ను ప్రేమిస్తాడు, నన్ను బాగా చూసుకుంటాడు."

ఆమె అడుగులు వేస్తూ వెళ్తోంది. భుజాల మీద నీటి క్యాన్ భారంగా ఉంది. ముందుకు వెళ్తోంది ఆమె. క్యాన్ లోపల నీళ్లు కొట్టుకోవడం ఆగిపోవడం గమనిస్తారు పిల్లలు. నడి దారిలో ఆమె ఆగిపోతుంది. క్యాన్‌ను కింద పెడ్తుంది. ఆమె పిల్లలు మూలుగుతూ, సణుగుతున్నారు. క్యాన్‌ను ముట్టుకుంటున్నారు. దాన్ని తాను విప్పబోనని అనుకుంటంది ఆమె. దుమ్ము క్యాన్ లోనికి చొరబడుతుంది. ఇంటికి వెళ్లే దాకా దాన్ని విప్పే సమస్యే లేదు.

"ఆగండి," పిల్లలతో అంటుంది ఆమె, "ఆగండి!"

తనను తాను సమీకరించుకొని, ముందుకు వెళ్లాల్సి ఉంది ఆమె.

ఆమె ఆలోచిస్తుంది, అక్కడ ఎక్కడో సూపర్ మార్కెట్ కన్నా పెద్దదైన విశాల భవనంలో పుస్తకాలతో నిండిన ఒక గ్రంథాలయం ఉందని నా టీచర్ చెప్పింది. ముందుకు కదులుతూ ముఖంపైకి

దుమ్ము వీస్తూ ఉంటే నవ్వుకుంటోంది ఆ యువతి. నేను తెలివైన దాన్ని అనుకుంటుంది. టీచర్ నేను తెలివైన దాన్ని అంది. స్కూల్లో అందరికన్నా తెలివైన దాన్ని అని చెప్పింది.

నా పిల్లలు తెలివైన వాళ్లవుతారు, నా లాగానే. వాళ్లను లైబ్రరీకి తీసుకెళ్తాను - పుస్తకాలు నిండి ఉండే చోటుకు. వాళ్లు స్కూల్‌కి వెళ్తారు. అధ్యాపకులవుతారు. నా టీచర్ నేను టీచర్ కావచ్చునని చెప్పింది. నా పిల్లలు ఇక్కడికి బాగా దూరంగా బాగా డబ్బు సంపాదిస్తూ ఉంటారు. వాళ్లు పెద్ద గ్రంథాలయం చేరువలో జీవిస్తారు. హాయైన జీవితం గడుపుతారు.

ఇంటికి రాగానే తన పిల్లలకు తను ఇచ్చే నీటి గురించి ఆలోచిస్తూ నిటారుగా నడుస్తోంది పాపం ఆ పిల్ల. తను కూడా కొంచెం నీరు తాగుతుంది ఇంటికి చేరాక. సాగిపోతోంది అలా ఆమె .... కరువుకు గురైన ఆఫ్రికాలో వీచే భయంకరమైన ధూళి మబ్బుల గుండా!

మనం మసక బారిపోయిన వాళ్లం. మనం, మన ప్రపంచంలో - ప్రమాదం అంచున ఉన్న మన ప్రపంచంలో, వ్యంగ్యానికీ, నిస్పృహ నిండిన వెటకారానికీ మనం గొప్ప వాళ్లం. కొన్ని మాటలు, ఆలోచనలను మనం అసలే ఉపయోగించం. అంతగా అరిగిపోయాయి, అవి. కాని శక్తి కోల్పోయిన కొన్ని మాటలను పునరుద్ధరించాలి అని మనం కోరుకోవచ్చునేమో!

మనకో గొప్ప వారసత్వ సంపద ఉంది - సాహిత్యపు సంపద - ఈజిప్షియనులు, గ్రీకులు, రోమన్ల కాలం నుండీ వస్తున్న సంపద. ఈ సాహిత్య సంపద, ఇదంతా నిలిచి ఉన్నది. దాని దరిదాపుల్లోకి వచ్చిన అదృష్టవంతులెవరైనా మళ్లీ మళ్లీ ఆవిష్కరించు కోవడానికి ఒక సంపద. ఒకవేళ అది లేదనుకోండి. ఎంత పేదరికంతో, ఎంతా ఖాళీగా ఉంటాం మనం!

భాషల, కవితల, చరిత్రల వారసత్వ సంపదకు యజమానులం మనం. ఎప్పటికీ తరిగి పోని సందప ఇది. అది ఉంటుంది, ఎల్లప్పుడూ. గతకాలపు కథకుల నుండి వచ్చిన కథల బహుమానం ఉంది మన దగ్గర. అందులో కొందరి పేర్లు మనకు తెలుసు, కొందరివి తెలియవు. కథకులు ఎల్లప్పుడూ కాలంతో వెనక్కి, వెనక్కి వెళ్తుంటారు - అడవి మధ్యలో ఉన్న ఖాళీ జాగాకు. అక్కడ ప్రాచీన పూజారులు ఆడుతూ పాడుతుంటారు. మన కథా వారసత్వం మొదలైంది అగ్నిలోనే, మాయా మంత్రాల జగత్తులో, ఆత్మల జగత్తులో! ఇవ్వాళ కూడా అక్కడే, ఆ సంపద అంతా ఒక దగ్గర నిల్చి ఉంది!

ఏ ఆధునిక కథకుణ్ణైనా అడిగి చూడండి. అగ్ని స్పృశించినట్టు తోచే క్షణమొకటి ఉంటుందని వాళ్లు చెప్తారు. దాన్ని మనం స్ఫూర్తి అంటాం. ఇది మనల్ని వెనక్కి వెనక్కి మన మానవ జాతి మూలాలకు, మనకు, మన ప్రపంచానికి రూపు నిచ్చిన నిప్పు, మంచు ఇంకా గొప్ప గాలులు జనించిన కాలానికి తీసుకెళ్తుంది.

మనలో ప్రతి ఒక్కరి హృదయం లోతుల్లో లోపల ఓ కథకుడు ఉన్నాడు. కథలు నిర్మించే వాడు మనతో ఎప్పుడూ ఉంటాడు. మన ప్రపంచం యుద్ధానికీ మనమందరం సులభంగా ఊహించగలిగే దారుణ కల్లోలాలకూ గురైందనుకోండి. మన నగరాల గుండా వరదలు పారాయనుకోండి, సముద్రాలు ఎగిసాయి ... అయినా కథకుడు ఎల్లప్పుడూ ఉంటాడు. ఎందుకంటే మనకు రూపు నిచ్చేవి, మనల్ని నిలిపేవి, సృష్టించేవి - మంచికో, చెడుకో - మన కల్పనలే. మనం చిరిగిపోయినప్పుడు, గాయపడినప్పుడు, నాశనమై పోయినప్పుడు కూడ మనల్ని పునఃసృష్టించేది మన కథకుడూ, మన కథలే! బూడిదల్లోంచి పునర్జన్మించే మన ఫీనిక్స్ మన కథకుడే మన స్వప్న రచయితే, మన పురాగాథా లేఖకుడే! మనం అత్యంత సృజనాత్మకంగా ఉండే స్థితి, అత్యుత్తమంగా ఉండే స్థితి అదే!

ధూళిలోంచి ఈడుస్తూ నడుస్తూ తన పిల్లలకు చదువు దక్కుతుందని కలగంటూ వెళ్లే ఆ బీద అమ్మాయికన్నా మనం మేలని అనుకుంటున్నారా? మనం, నిండా తిండి కుక్కేసిన వాళ్ళం, బీరువాల నిండా బట్టలెక్కువైన వాళ్ళం, అనవసరమైన హంగులతో ఊపిరాడక కొట్టుకుంటున్న వాళ్ళం?

మూడు రోజులుగా తిండి లేకపోయినా పుస్తకాల గురించి, చదువు గురించి మాట్లాడుకుంటున్న ఆ అమ్మాయి, ఆ స్త్రీలే మనల్ని ఎప్పటికైనా నిర్వచిస్తారని నేను అనుకుంటాను.

*జీవిత చరిత్ర*

- పుట్టింది 1919లో పర్షియాలో (ఇప్పటి ఇరాన్)
- తండ్రి ఇంపీరియల్ బ్యాంక్‌లో క్లర్క్.
- డోరిస్‌కి ఐదేళ్ల వయస్సప్పుడు తండ్రి దక్షిణ రోడేషియా (ఇప్పుడు జింబాబ్వేదేశం)లో మొక్కజొన్న పండే వ్యవసాయ క్షేత్రాన్ని కొనుక్కొని కుటుంబంతోసహా తరలివెళ్లాడు.
- వర్ణవివక్ష, వలసవాదం రాజ్యమేలుతున్న రోడేషియాలో గడిపిన బాల్యం డోరిస్‌పై గాఢమైన ప్రభావం చూపింది : "ఇంట్లో మా అమ్మ పియానోపై బీథోవన్, షాపెన్‌ల సంగీతం వాయించేది. బయట కాంపౌండ్‌లో ఆఫ్రికా డప్పుల ధ్వని వినిపించేది. అవి రెండూ కలిసి వాయించకూడదని నాకెప్పుడూ అనిపించలేదు. ఆఫ్రికన్ డప్పులు, షాపెన్ పూర్తిగా విభిన్న సంస్కృతులకు చెందిన వ్యవహారాలని పెద్దయ్యాక గానీ తెలియలేదు."
- అటవీ ప్రాంతం నల్లజాతివారి మధ్య బాల్యజీవితం చాలా ఆనందకరంగా ఉన్నా కుటుంబంలో చాలా సమస్యలుండేవి. ముఖ్యంగా తల్లితో డోరిస్‌కి పడేదికాదు. ఈ ఉద్రిక్త పరిస్థితి కారణంగా అబ్బిన సూక్ష్మపరిశీలనా దృష్టి ఆమెను ఏడేళ్ల వయస్సులోనే రచయిత్రిగా మార్చేసింది.
- 14 ఏళ్లకు స్కూల్ చదువు-నచ్చక-స్వస్తి చెప్పి తనే చదువుకుంది.
- 20 ఏళ్లకు వివాహం, ఇద్దరు పిల్లలు. దక్షిణ రోడేషియాలో రాజకీయ పరిస్థితుల పట్ల ముఖ్యంగా జాతివివక్ష పట్ల ఆమెకు చాలా అసంతృప్తిగా ఉండేది. 23 ఏళ్లకు కమ్యూనిస్టు పార్టీలో చేరి తనలాగా ఆలోచించే వాళ్లను కలవగలిగింది. మొదటి భర్తను, ఇద్దరు పిల్లలను వదిలేసి జర్మనీ నుండి వచ్చిన కమ్యూనిస్టు గాట్‌ఫ్రేడ్ లెస్సింగ్‌ను వివాహమాడింది.
- 1949లో వాళ్లిద్దరూ విడిపోయారు. రోడేషియాలో పరిస్థితి భరించలేక తన చిన్నకొడుకుతో, తన మొదటి నవల 'గడ్డినవ్వుతోంది' (The Grass is Smyling) రాతప్రతితో ఇంగ్లండ్‌కు తరలి వచ్చింది.
- మరు సంవత్సరం ప్రచురితమైన ఆ నవలకు మంచి ఆదరణ లభించింది. అప్పటి నుండి ఇంగ్లండ్‌లోనే నివాసం.
- ఆరంభంలో రాసిన నవలలు, కథలపై ఆఫ్రికాలో గడిపిన జీవితం, జ్ఞాపకాల ప్రభావం ఎక్కువగా ఉండేది.
- నిరంతరం రచనా వ్యాసంగంలోనే నిబద్ధమై ఉండే డోరిస్ 50 పై చిలుకు పుస్తకాలు రాశారు. వీటిలో నవలలు, కథల సంపుటాలు, సైన్స్‌ఫిక్షన్, ఒక బొమ్మల నవల, నాటకాలు, రెండు సంగీత రచనలు, వ్యాసాల్లాంటి ఇతర వచన రచనలు ఉన్నాయి.

- రచనా ప్రక్రియ స్వేచ్ఛను ఇస్తుందంటారు డోరిస్. అణగారిన వారికి, లోకం తీరుకి విభిన్నంగా ఉండే వారికి, మూగవోయిన వారికి 20వ శతాబ్దం సృష్టించిన లక్షలాది నిర్వాసితులు, కాందిశీకుల క్షోభకు తన రచనల ద్వారా గొంతుకనివ్వడంలో అన్నిరకాల సంప్రదాయాలను పరిశీలించి ప్రశ్నించడంలో, సామాన్య వర్గీకరణలకు లొంగని రీతిలో ఉత్కృష్ట సాహిత్యశిల్ప పద్ధతులను, మామూలు ప్రజల సాంస్కృతిక ధోరణులను, వివిధ కాలాలు, నేపథ్యాలు, దృక్కోణాలను, వాస్తవిక, ఆలంకారిక, ప్రతీకాత్మక శైలులనూ అనేకానేక రీతుల్లో కలబోసి మార్మిక, స్వప్న జగత్తుల్లో, ఆఖరికి పిచ్చిప్రవర్తనలో కూడా దాగిఉండే లోతైన సత్యాన్ని వెలుగులోకి తెచ్చి ఆవిష్కరించడంతో అనవసరతమైన ఆ స్వేచ్ఛా వ్యాపకమే కనిపిస్తుంది.
- అన్నింటికన్నా ముఖ్యంగా ఎన్ని లోపాలు, వైఫల్యాలు ఉన్నా 20వ శతాబ్దంలో స్త్రీ చేసిన సంఘర్షణకు, సామాజిక, మానసిక పోరాటానికి, సాధించుకున్న అహమికకు డోరిస్, ఆమె రచనలు తార్కాణంగా నిలుస్తాయి.
- ఏ చిన్న విషయమూ, ఎంతటి మారుమూల దాగిఉన్న ఏ అర్భక వస్తువూ, జీవీ, బీరువాల్లో, దుప్పట్లకింద, రాళ్లమధ్యా దాచిపెట్టిన ఏ రహస్యమూ, భేషజమూ ఆమె చూపుకి అందకుండా పోదు. అందరికీ ఆశ్రయమిచ్చి పట్టించుకొనే - స్త్రీ లక్షణం లాంటిదని అందామా - ఆమె రచనావరణం. ఎలా..... ఎందుకు..... జీవిస్తున్నాం? ఈ శాశ్వత ప్రశ్నలను మళ్లీమళ్లీ ఆమె పాఠకుల ముందుకు పట్టుకొస్తుంది.
- మానవ దృక్కోణాలను, ప్రవర్తనా రీతులన్నింటినీ ఏ రకమైన వివక్ష లేకుండా చూడగలగడం వల్ల 20వ శతాబ్దం సృష్టించిన లక్షలాది నిర్వాసితులు, కాందిశీకుల క్షోభకు వలసవాదం నుండి తృతీయ ప్రపంచ దేశాల్లో స్వాతంత్ర్యం లభించిన తర్వాత వికృతంగా పెచ్చరిల్లిన అవినీతి, దోపిడీ; గొప్ప సైద్ధాంతిక ఆదర్శాలు దారితప్పి మిగిల్చిన నియంతృత్వమూ, అజ్ఞానమూ, నిస్పృహా; ఇంకా పర్యావరణ సంక్షోభం వంటి ఆత్మనాశక ధోరణులను ఆమె తన రచనల్లో ముందే పసిగట్టి హెచ్చరికలు చేసింది.

ముఖ్యమైన రచనలు :

- తన జీవితాన్నే భూమికగా పెట్టుకొని రాసిన Children of Violence నవలా మాలిక (1952-1969).
- The Golden Notebook (1962)
- Briefing for a Desceut into Hell (1970)
- Canopus in Argus : Archives (సైన్స్ ఫిక్షన్ నవలామాలిక 1979-84).
- The Good Terroriat (1985)
- Under My Sbim (1994)
- Walking in Me Shade (1997)
- Mara in Doon (1999), దాని తర్వాతి భాగం (The story of General Dann and Mara's Daughter, Girot & hue snow Dog (2005)

(సమాప్తం)




నోబెల్ సాహిత్య పురస్కార గ్రహీత డోరిస్ లెసింగ్ (2007)

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD-191/2006-08

